

భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 40.0
కనిష్ఠం : 24.0

దోబూచులాట!



(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనువుగా నామినేషన్లు దాఖలు చేసే ప్రక్రియ కొద్దిరోజుల్లోనే ఆరంభం కానుంది. కాని ఉమ్మడి కూటమిలో సీట్లు సర్దుబాటు ఇంకా దోబూచులాటగానే ఉంది. ప్రత్యేకించి కొన్ని స్థానాల్లో మార్పులు, చేర్పులకు అనువుగా ఈ మధ్యనే కూటమి అగ్రనాయకుల మధ్య సమీక్ష సాగింది. పలు అంశాలు చర్చకు వచ్చాయి. ఇప్పటివరకు సీటు దక్కక తీవ్ర అసంతృప్తి, ఆగ్రహంతో రగిలిపోతున్న వారికి ఏదోఒక ప్రత్యామ్నాయంగా సీటు కేటాయించాలన్న డిమాండ్ మరోసారి ముందుకు వచ్చింది. సోమవారం సాయంత్రం నాటికి ఇదేకో కొలిక్కి వచ్చే అవకాశం ఉంది. కాని ఈ మధ్య ఆ సీటు, ఈసీటు అంటూ చిలువలు, వలవులుగా ప్రచారం సాగుతోంది.

బీజేపీ వ్యూహం ఏంటి

భారతీయ జనతా పార్టీ ఉమ్మడి పశ్చిమలోనే తమపార్టీ అభ్యర్థులు పోటీచేసే సీట్లపై ఇంకా తడబడుతూనే ఉంది. ఇంకోవైపు సీటు ఆశించి అదీ కుదరక డీలా పడిన వారికి ఏదోఒక సీటులో ప్రత్యామ్నాయంగా పోటీకి నిలపాలని ఆ పార్టీ భావిస్తోంది. రెండురోజుల క్రితమే టీడీపీ, జనసేన, బీజేపీ అగ్రనాయకుల మధ్య కీలక చర్చలు జరిగాయి. మార్పులు, చేర్పుల అంశం తెర ముందుకు వచ్చింది. ఏలూరు ఎంపీ స్థానాన్ని ఆశించిన తపనా చౌదరికి ఎట్టి పరిస్థితు ల్లోనూ అసెంబ్లీకి పోటీచేసే అవకాశాన్ని కల్పించాలని ఆపార్టీ గట్టిపట్టుదలతోనే ఉంది. ఇదే విషయాన్ని బీజేపీ నేతలు, తెలుగుదేశం అభ్యర్థి చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ చెవిన వేశారు. బీజేపీ ఆదినుంచి ఏలూరు ఎంపీ స్థానం, ఉంగుటూరు అసెంబ్లీ స్థానాన్ని ఆశిస్తూ వచ్చిన

సీట్లమార్పిడి అంటూ దుమారం
రోజుకో సీటు లింకుపెట్టి మరీ ప్రచారం
బీజేపీ తాజా డిమాండ్‌తో మళ్లీ రాజకీయ ఆసక్తి
తపనా చౌదరికి సీటుకోసం కమలనాథుల పట్టు
నేటి సాయంత్రం నాటికి కీలక పరిణామాలు



సీట్ల కేటాయింపు వచ్చేసరికి ఈ రెండుస్థానాలను ప్రస్తావించ కుండా వదిలేసింది. ఈ నేపథ్యంలోనే ఆ పార్టీలో అంతర్గత అసంతృప్తికి దారితీసింది. పార్టీ రాష్ట్రప్రధాన కార్యదర్శి హోదాలో ఉన్న తపనా చౌదరి ఆశిస్తున్న ఏలూరు లోక్‌సభ స్థానాన్ని తెలుగుదేశంకు కేటాయించారు. ఈ స్థానం నుంచి ఇప్పటికే టీడీపీ అభ్యర్థిగా పుట్టా మహేష్ కుమార్ యాదవ్ రంగంలో ఉన్నారు. ప్రతి నియోజకవర్గం లోనూ ఆయన సుడిగాలి పర్యటన చేస్తున్నారు. ఏలూరు ఎంపీ సీటు ఎలాగో దక్కలేదు కాబట్టి తమ నేత తపనా చౌదరికి కనీసం అసెంబ్లీకి పోటీచేసే అవకాశమైనా ఏదో సీటు కేటాయిం చాలంటూ బీజేపీ కొత్తగా ప్రతిపాదించింది. పార్టీని నమ్ముకుని సుదీర్ఘకాలం పాటు సేవలు అందించిన చౌదరి ఇక తన రాజకీయ భవిష్యత్తుపై అటో ఇటో తేల్చుకోవాలని నిర్ణయించిన తర్వాతే బీజేపీ ఒక్కసారిగా మేల్కొంది. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఎలాగో అనపర్తి స్థానాన్ని తమ పార్టీ వదులుకుంటున్నందున ప్రత్యామ్నాయంగా ఏదో ఒక అసెంబ్లీ స్థానం తమకు కేటాయించాల్సిందేనని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు దాని ప్రభావం కాస్త ఏలూరు జిల్లాపై పడింది. ఇదే జిల్లా పరిధిలో ఉంగుటూరు స్థానాన్ని ఇప్పటికే జనసేనకు కేటాయించారు. అయినా కూడా తిరిగి ఉంగుటూరు స్థానాన్నే పదేపదే ప్రస్తావిస్తూ ఉండడంతో జనసేన సేనాని పవన్‌తో పాటు చంద్రబాబు వ్యతిరేకించారు. మరే ఏ స్థానం నుంచి బీజేపీకి అవకాశం ఇవ్వాలనే దానిపై తర్జనభర్జన జరుగుతోంది. ప్రత్యేకించి తపనా చౌదరికి అవకాశం ఇవ్వాలంటే ఏ స్థానాన్ని కేటాయిస్తారనే దాని పై తెలుగుదేశంలోనూ కాస్తా గందరగోళం నెలకొంది. ఈ నేపథ్యంలోనే గడిచిన రెండు రోజులుగా వివిధ నియోజకవర్గాల పేర్లు ప్రచారంలోకి వస్తున్నాయి. కొందరు అదే నియోజకవర్గం నుంచి బీజేపీ పోటీ చేయబోతున్నదంటూ బెట్టింగ్‌లకు దిగడంతో పరిస్థితి మరింత గందరగోళంగా మారింది. తాము ఎలాగో ఒక సీటును వదులుకుంటున్నందున ప్రత్యామ్నాయంగా ఇంకో సీటు కేటాయించాల్సిందేనన్న బీజేపీ పట్టుదలతో తెలుగుదేశం కూడా దీనికి సమ్మతించినట్టు సమాచారం.

ఏమిటా నియోజకవర్గం ?

ఏలూరు జిల్లాలోనే ఏదోస్థానం కేటాయిస్తారంటూ తాజా చర్చల దరిమిలా అసలు విషయం ధ్రువపడింది. కాని అది ఏ నియోజకవర్గం అనేది సస్పెన్స్‌లో పడింది. సోమవారం సాయంత్రానికల్లా దీనిపై తుది నిర్ణయం తీసుకుంటారని సంకేతాలు వస్తున్నాయి. వాస్తవానికి కూటమిలో ఈ తరహా పరిస్థితులు తలెత్తడం సీనియర్లను బెంబేలెత్తిస్తోంది. ఒకానొక దశలో తపనా చౌదరి కూడా కాస్తంత ఘాటైన చర్యలకు దిగాలని భావించారు. ఏలూరు ఎంపీ స్థానం నుంచే తాను పోటీలో ఉంటానంటూ తన కేడర్‌కు సంకేతాలు ఇచ్చారు. పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటారా లేదా అనేది పక్కనపెట్టి దూకుడుగానే ముందుకెళ్లారు. ఈ నేపథ్యంలోనే బీజేపీ రాష్ట్ర నాయకత్వం ఓ అడుగు కిందకు దిగి తపనా చౌదరి వైపు ఫోకస్ పెట్టింది. ఏదైతే అనపర్తి స్థానంలో కొత్తగా కోరుకుంటున్న అసెంబ్లీ స్థానం నుంచే చౌదరిని పోటీ చేయించాలనే యోచనలో ఆ పార్టీ ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఏడు నియోజకవర్గాల్లో పోలవరం, ఉంగుటూరు జనసేనకు కేటాయించగా, కైకలూరును బీజేపీకి కేటాయిం చారు. ఇకపోను దెందులూరు, ఏలూరు, నూజివీడు, ఎస్సీ రిజర్వుడ్ స్థానమైన చింతలపూడి అసెంబ్లీ నియోజక వర్గాలు ఉండగా, వీటిలోనూ టీడీపీ అభ్యర్థులు ప్రచారంలో హోరెత్తిస్తున్నారు. మరి ఇలాంటి తరుణంలో ఏ సీటు బీజేపీకి ఇస్తారనే దానిపైనే గందరగోళం నెలకొంది. పలానా నియోజకవర్గం బీజేపీ ఖరారు అయిందని కొందరు, ఆ స్థానంలో ఉన్న టీడీపీ అభ్యర్థిని పక్కకు తప్పించటానికి సిద్ధంగా ఉన్నారని మరికొందరు ఎవరినోటికి వచ్చినట్టు వారు ప్రచారం కొనసాగిస్తున్నారు. దీనికితోడు పోలవరం నియోజక వర్గంలో జనసేన అభ్యర్థి చిర్రి బాలరాజు తమపార్టీకి సహకరించడం లేదని స్థానిక తెలుగుదేశం నాయకత్వం గుర్రుగా ఉంది. ఇదే విషయాన్ని పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లబోతున్నారు. నూజివీడులోనూ టీడీపీ రెబల్ అభ్యర్థి సవాళ్ళు ప్రతి సవాళ్ళు కొనసాగిస్తూనే ఉన్నారు. ఇక్కడ కూడా వాటిని ఏమాత్రం ఖాతరు చేయకుండా ముందుకు వెళ్ళాలని తెలుగుదేశం పట్టుదలతో ఉంది. నామినేషన్‌ల గడువుకు సమీపిస్తుండగా ఈ లోపే ఈ సీట్ల మార్పిడి వ్యవహారం కార్యకర్తలకు ఏ మాత్రం రుచించడం లేదు.



కలెక్టరేట్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన కలెక్టర్ సుమిత్ కుమార్

అంబేడ్కర్ మార్గం అనుసరణీయం : కలెక్టర్

భీమవరం టౌన్, ఏప్రిల్ 14 : సమాజంలో కుల వివక్షత, ఆర్థిక అసమానతలు సమూలంగా రూపు మాపేందుకు విద్య ఒక్కటే మార్గమని ఆనాడు డాక్టరు బీఆర్ అంబేడ్కర్ అన్నారని ఆయన మార్గం నేటి యువతకు అనుసరణీయమని జిల్లా కలెక్టరు సుమిత్ కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లో ఆదివారం జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంబేడ్కరు 133వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన విగ్రహానికి కలెక్టరు, జాయింటు కలెక్టరు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాయింటు కలెక్టరు ప్రవీణ్ ఆదిత్య మాట్లాడుతూ చిన్నప్పుడు ఆయన ఎన్నో వివక్షతలను ఎదుర్కొన్నారని దాని నుంచి బయట పడేందుకు విద్య ఒక్కటే మార్గమని భావించి ఉన్నత విద్యను అభ్యసించా రన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కర రావు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కె.శోభా రాణి, వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశ్వర రావు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి మంగపతిరావు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.



మామిడి తోటలను పరిశీలిస్తున్న ఏలూరు జిల్లా ఉద్యానవన అధికారి ఎస్.రామ్మోహన్

విదేశాలకు నూజివీడు మామిడి

నూజివీడు టౌన్, ఏప్రిల్ 14 : ప్రస్తుత సీజన్‌లో నూజి వీడు మామిడిని కెనడా, అమెరికా దేశాలకు ఎగుమతి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఏలూరు జిల్లా ఉద్యాన వనశాఖ అధికారి ఎస్.రామ్మోహన్ తెలిపారు. నూజివీడు మండలం వెంకటాయపాలెం గ్రామానికి చెంది న మామిడిరైతు ఎం.బీవీ రాఘవరావు, మామిడి తోటను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్గానిక్ విధానంలో రాఘవరావు ఎనిమిది ఎకరాల్లో బంగినపల్లి, చిన్నరసం, చెరుకు రసాలను సాగు చేశారని, కాయల నాణ్యత బాగుందని, ఈనెల 16వ తేదీన (మంగళవారం) 1.2 టన్నుల మామిడిపండ్లను కెనడాకు, 25వ తేదీన అమెరికాకు ఎగుమతి చేయనున్నట్టు తెలిపా రు. గత సీజన్‌లో జిల్లా నుంచి 125 టన్నుల మామిడిని బ్రిటన్, కెనడా, సౌదీ అరేబియా, దుబాయ్, అమెరికా వంటి దేశాలకు ఎగుమతి చేశామని, ప్రస్తుత సీజన్‌లో 300 టన్నుల మామిడికాయలను నూజివీడు ప్రాంతం నుంచి ఎగుమతి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నా రు. నూజివీడు ఉద్యానవనశాఖ అధికారిణి ఆర్.హేమ, మామిడి రైతు రాఘవరావు, ఇతర రైతులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా 'ఓపెన్' దూరవిద్య పరీక్షల ఫలితాలు

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 14 : ఏపీ ఓపెన్ స్కూల్స్ దూరవిద్య పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం ఆది వారం ముగిసింది. శనివారం ప్రారంభమైన స్పాట్ వాల్యూ యేషన్ కేవలం రెండు రోజుల వ్యవధిలోనే ముగియడం విశేషం. ఇంటర్మీడియట్ పరీక్షల జవాబు పత్రాలు మొత్తం 6,500 జిల్లాకు వచ్చాయి. కాగా ఈ పరీక్షల ఫలితాలు నెలాఖరులోగా ప్రకటించే అవకాశాలున్నాయి.

22న నామినేషన్ వేస్తా

ఎంపీ రఘురామకృష్ణరాజు



ఉండి, ఏప్రిల్ 14: తాను ఎక్కడ నుంచి పోటీ చేస్తాననేది రెండు రోజుల్లో క్లారిటీ వస్తుందని అది ఎంపీ గానా లేక ఎమ్మెల్యేగానా అనేది త్వరలో చెబుతానని నరసాపురం పార్లమెంటు సభ్యుడు కనుమూరు రఘు రామకృష్ణరాజు అన్నారు. నామినేషన్ మాత్రం ఈనెల 22న వేస్తానని స్పష్టం చేశారు. ఆదివారం ఆయన ఉండి మండలం వెలివర్రు లోని వీర పేరంటాలమ్మ అమ్మ వారిని దర్శించుకున్నారు. ఈ ప్రాంతానికి వచ్చినపుడు అమ్మ వారి ఆశీర్వాదం తీసుకోవడం తనకు సెంటిమెంట్ అన్నారు. చంద్రబాబునాయుడు ముఖ్య మంత్రి కావాలని జగన్ ఓడిపోవాలని కోరుకున్నట్లు తెలి పారు. గతంలో తాను ఎంపీగా ఎన్నికైన తరువాత అమ్మవారి ఆల యానికి విచ్చేసి మొక్కలను నాటానని ఈ ప్రాంతమంతా పచ్చని చెట్లతో కళకళలాడుతుందన్నారు. సీఎం వస్తున్నా రంటే ఆ ప్రాంతంలో ఉన్న పచ్చని చెట్లను అధికారులు నిర్దాక్షిణ్యంగా నరికేస్తున్నారని అన్నారు.

నేడు ఏలూరులో సీఎం బస్సు యాత్ర

రేపు భీమవరంలో..

పెదవేగి/ ఉంగుటూరు, ఏప్రిల్ 14 : సీఎం వైఎస్ జగన్ మేము సిద్ధం బస్ యాత్ర సోమవారం ఏలూరు జిల్లాలో జరగనుంది. ఏలూరు, దెందులూరు, భీమడోలు, కైకరం వరకు ప్రచారం నిర్వహిస్తారు. రాత్రి ఎనిమిది గంటలకు నారాయణపురం చేరుకుని, అక్కడ రాత్రి బస చేస్తారని సీఎం అడిషనల్ పీఎస్ నాగేశ్వరరెడ్డి తెలిపారు. కాగా సీఎం జగన్ బస చేసే ప్రాంతాన్ని ఆదివారం సాయంత్రం జిల్లా ఎస్పీ దాసరి మేరీ ప్రశాంతి పరిశీలించి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. భీమవరంలో సోమ వారం తలపెట్టిన బస్సు యాత్ర వాయిదా పడింది. మంగళవారం యాత్రను నిర్వహించనున్నారు.

ఇన్సూరెన్స్ సొమ్ములకు.. ఎసరు!



ఉంగుటూరు మండలంలో పని చేస్తున్న ఒక ఉపాధ్యా యుడు 2008 డీఎస్సీ ద్వారా అపాయింట్ అయ్యారు. అతనికి 2011 నుంచి 2020 వరకు మిస్సింగ్ క్రెడిట్స్ వచ్చాయి. అంటే మినహాయించ బడిన ప్రీమియం సొమ్ము వారి ఖాతాలో జమ కాలేదు. అతను 2013లో అంతర్ జిల్లా బదిలీలో ఈ జిల్లాకు వచ్చాడు. ఇప్పుడు పూర్వ జిల్లా నుంచి షెడ్యూల్స్ బిల్ నెంబర్స్ ఏ విధంగా తెచ్చుకోగలడు. మిస్సింగ్ క్రెడిట్స్ సొమ్ములు ఎక్కడకు పోయినట్టు.

2012 డీఎస్సీ ద్వారా ఎంపికై వీరవాసరం మండలంలో పని చేస్తున్న ఒక స్కూల్ అసిస్టెంట్ తన సర్వీసులో ఇప్పటికే నాలుగు చోట్లకు బదిలీ అయ్యాడు. ఇప్పుడు మిస్సింగ్స్ క్రెడిట్స్ పేరుతో పంపిన నోటీసులో ఏకంగా ఏడు నెలల ప్రీమియం సొమ్ము జమకాలేదని పేర్కొన్నారు. ఇలా 12 ఏళ్ల తర్వాత ప్రీమియం సొమ్ములు కట్టలేదం టూ సెలవివ్వడం ఎంతవరకు న్యాయమని ఆ ఉద్యోగి ప్రశ్నిస్తున్నాడు.

ఏపీజీఎల్‌ఐ ఖాతాదారుల్లో ఆందోళన
ఉద్యోగుల జీతం నుంచి సొమ్ము మినహాయింపు
మిస్సింగ్స్ క్రెడిట్స్ 15 ఏళ్లకు పైనే..
ట్రెజరీ బిల్లుల మినహాయింపు..కానీ జమలేదు
రెండేళ్లుగా రిటైర్డ్ ఉద్యోగుల ఎదురుచూపులు
ఏపీజీఎల్‌ఐ రుణాల కోసం పడిగాపులు

నిడమర్రు ఏప్రిల్ 14 : ఓ ఉద్యోగి తాను కష్టపడి సంపాదించిన సొమ్ము ఓ ప్రభుత్వ సంస్థలో దాచుకొంటే ఆ సొమ్ములు గల్లంతవుతున్నాయి. తన జీతం నుంచి నెల నెలా మినహాయించి దాచిపెట్టుకొన్న సొమ్ములు ఎక్కడో పోయాయో తెలియక ఏమి చేయలేని పరిస్థితి నేడు ఉద్యోగులలో నెలకొంది. ప్రభుత్వ సంస్థ అయిన ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ లైఫ్ ఇన్సూరెన్స్ (ఏపీజీ ఎల్ఐ) సంస్థలో పాలసీలు కడుతున్న ఉద్యోగుల ప్రీమియం సొమ్ములు జమ సంబంధిత డ్రాయింగ్ అథారిటీ ద్వారా మినహాయించ బడుతూ ట్రెజరీ ద్వారా ఆ సంస్థకు నెలనెలా జమ చేయబడతాయి. కానీ నేడు ఏపీజీఎల్ఐ సంస్థలో ఉద్యోగుల సొమ్ములు ఖాతాల్లో జమకాలేదని 15 ఏళ్ల తర్వాత చావుకబురు చల్లగా చెప్పారు సంబంధిత శాఖ వారు. ఖాతాలో సొమ్ములు జమ కాకుంటే ఏటా ఆ వివరాలు చెప్పడం మానివేసి ఒక్కసారిగా 15 ఏళ్ల తర్వాత చెప్పడం ఎంతవరకు సమంజసమని ఉద్యోగ వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జీవిత బీమా సంస్థ రాష్ట్రంలో పనిచేసే ఉద్యోగులకు ఇన్సూరెన్స్ నిమిత్తం ప్రీమియం సొమ్మును కట్టించుకుని జీవిత బీమా పాలసీని అందజేసేవారు. ఉద్యోగి రిటైర్‌మెంట్ సమయంలో వారికి మొత్తం ఇన్సూరెన్స్ సొమ్మును అందజేసేవారు. కానీ నేడు ఈ సంస్థ ఉద్యోగులను నట్టేట ముంచింది. ఉమ్మడి జిల్లాలో అన్ని శాఖల ఉద్యోగులు సుమారు 70 నుంచి 80 వేల మంది ఉంటారు. వీరికి సంబంధించి సుమారు రూ.60 కోట్ల నుంచి రూ.70 కోట్లు ప్రీమియం సొమ్ము గల్లంతు అయ్యిందని ఉద్యోగ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇది ఆయా సంస్థలో పనిచేసే ఉద్యోగుల పొరపాటా లేక సొమ్ములు కాజేశారా..? అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2021 డిసెంబరులో ఉద్యోగ విరమణ చేసిన ఓ విశ్రాంత ఉద్యోగికి తాను దాచుకొన్న జీవిత బీమా సొమ్ము చెల్లించడానికి ప్రభుత్వానికి సుమారు రెండేళ్లు పట్టిందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. సర్వీసులో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు కూడా ఈ రకమైన ఇబ్బందే ఎదుర్కొంటున్నారు. తమ ఆపత్కాలంలో అత్యవసర సమయంలో లోన్ ద్వారా తమ ఖాతాలో సొమ్ము విత్‌డ్రా చేసుకొందామని దరఖాస్తు చేసుకుంటే 10 నుంచి 12 నెలలకు గాని మంజూరు కావడం లేదు.

మిస్సింగ్స్ క్రెడిట్స్ 15 ఏళ్లకు పైనే..

ఏపీజీఎల్ఐ యాజమాన్య లోపం వల్ల ఉద్యోగులకు సంబంధించి గత 15 ఏళ్లుగా జమ కాని ప్రీమియం సొమ్ము లను ఉద్యోగులు కోల్పోవాల్సి వస్తోంది. 2009 నుంచి ట్రెజరీ బిల్లుల్లో మినహాయించినా ఈ ప్రీమియం సొమ్ములు అందలేని ఇప్పుడు తెలపడం ఏంటని ఉద్యోగ వర్గాలు ప్రశ్నిస్తున్నాయి.

ఎందుకింత అలసత్వం ?

ఏ ప్రభుత్వ సంస్థ అయినా ఏటా తమ ఖాతాలను జమ చేయబడిన సొమ్ము, ఖర్చు అయిన సొమ్ములపై ఆడిట్ నిర్వహిస్తుంది. కానీ ఒక జీవిత బీమా సంస్థ అయి ఉండి ఉద్యోగుల ప్రీమియం సొమ్ముల చెల్లింపులో ఇంత అలసత్వం ఏంటని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నాయి. ప్రతినెలా ట్రెజరీ ద్వారా వచ్చే ఆన్‌లైన్ పేమెంట్స్‌ను ఉద్యోగులకు వారి ఖాతాలో జమ చేయడంలో ఎందుకు అలసత్వమో అర్థం కావడం లేదు.

పల్లె వైద్యం పడకేసింది

భీమవరం రూరల్, ఏప్రిల్ 14 : పల్లె వైద్యం..పడకేసింది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఉన్న విధానాలకు స్వస్తి పలికింది. కొత్త స్కీమ్‌లను తీసుకువచ్చింది. జగనన్న ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ ఫిజీషియన్ క్యాంపులను ప్రచార ఆయుధాలుగా వాడుకుంటున్నదే గానీ వాస్తవానికి వైద్య సేవలు అందించ లేకపోతున్నది. మొక్కుబడి తంతుగా నిర్వహిస్తున్నారని గ్రామాల్లో విమర్శలు వస్తున్నాయి. జిల్లాలో 34 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. 68 మంది వైద్యులు, వంద మందికిపైగా స్టాఫ్‌నర్సులు ఉన్నారు. పీహెచ్‌సీ పరిధిలో ఐదు వందలకు పైగా ఏఎన్‌ఎంలు పనిచేస్తున్నారు. అయితే రోజువారీ ఓపీ కొన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో 30 మంది కొన్ని పీహెచ్‌సీలలో అంతకన్నా తక్కువ నమోదు అవుతోంది. పీహెచ్‌సీలలో సౌకర్యాలు లేకపోవడంతో ప్రభుత్వ ఆసుపత్రులవైపు చూడడం లేదని చెబుతున్నారు. ప్రభుత్వ వైద్యం అంతంతమాత్రంగా ఉండడంతో ఆర్ఎంపీలు పెరి గారు.ఒక్కో ఆర్ఎంపీ రోజుకు 40 మంది వరకు వైద్యం అందిస్తున్నారు. ప్రభుత్వ వైద్యం ప్రజలకు దూరమైంది.



ప్రయోగాలు సరే.. ఫలితం ఏదీ ?

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సౌకర్యాలు, వైద్యసేవలు అందుబాటులోకి తీసుకొస్తే గ్రామాల్లో ఉపయోగకరంగా ఉంటుంది. ప్రభుత్వం ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ ఫిజీషియన్ క్యాంప్‌లను ప్రజాప్రతినిధులతో హడావుడిగా ప్రారంభించి చిన్నపాటి టెస్టులు చేసి లక్షల మందికి చికిత్స అందించినట్లు ప్రచారం చేయడం చేసుకుంటున్నది.

విలేజ్ హెల్త్ క్లినిక్స్ ఉపయోగమెంత

గ్రామాల్లో విలేజ్ హెల్త్ క్లినిక్స్ అందుబాటులోకి తెచ్చా మని గొప్పలు తప్ప వైద్య సేవలు ఎవరికీ అందడం లేదు. విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో 365 ఎంఎల్‌హెచ్‌పీలను (మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్) ఏర్పాటు చేసింది. అయితే వారి వైద్య సేవ లపై ప్రజలకు అవగాహన లేకపోవడంతో ఆశక్తి చూపడం లేదు. దీంతో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేందుకే గానీ వాస్తవంగా వైద్యసేవలు అందడం లేదు. విలేజ్ హెల్త్ క్లినిక్ ఎక్కడ పెట్టాలో తెలియని పరిస్థితుల్లో సచివాలయాలు, అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. అవి కూడా ఎప్పుడు ఎక్కడ పెడతారో కూడా తెలియడం లేదు.

సబ్ సెంటర్ల ప్రాధాన్యం

గ్రామాల్లో ప్రభుత్వ వైద్యసేవలకు అందుబాటులో ఉండేలా సబ్ సెంటర్‌లు ఏర్పాటు చేశారు. వాటిలో ఏఎన్‌ఎం, ఆశావర్కర్లు టెస్టులు చేసి అవసరమైన వారికి మందులు ఇచ్చేవారు. టీడీపీ ప్రభుత్వం హయాంలో చాలా సబ్ సెంటర్ భవనాలు నిర్మించారు. జిల్లాలో 300 వరకు సబ్‌సెంటర్ భవ నాలు ఉంటాయి. వైసీపీ ప్రభుత్వం వచ్చాక సబ్ సెంటర్లకు ప్రాధాన్యం లేకుండా చేసింది. సచివాలయాలలో ఏఎన్‌ఎంలను ఏర్పాటు చేసింది. కానీ సచివాల యాలు చాలా గ్రామా లలో దూరంగా ఉండటం వల్ల వృద్ధులకు ప్రభుత్వ వైద్యం అందడం లేదు.

ఆరోగ్యమిత్రలు ఏమయ్యారు

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో పీహెచ్‌సీలో ఒక ఆరోగ్య మిత్ర ఉండటం వల్ల వైద్య సేవలు అందుబా టులో ఉండేవి. వైసీపీ ప్రభుత్వం వాటిని తీసివే యడంతో ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్‌లు కొన్ని పీహె చ్‌సీలకే పరిమితమయ్యాయి. అవగాహన కల్పించేవారు లేక ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్‌లు తగ్గాయి.

ప్రచారానికే పరిమితం.. వైద్య సేవలు నిల్
ఆరోగ్య సురక్ష క్యాంపుల పేరుతో మొక్కుబడి వైద్యం
విలేజ్ హెల్త్ క్లినిక్స్‌తో ఒరిగిందేమీ లేదు..
గ్రామాల్లో ఆర్‌ఎంపీలదే హవా..



ఆ నాలుగు చోట్ల పీహెచ్‌సీలు ఏవీ?

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మండలానికి రెండు చొప్పున అందుబాటులోకి ఉంచడంతో పాటు, వైద్యులు ఏర్పాటు చేస్తామన్న ప్రభుత్వం ఆ మాటే మరిచింది. పాలకోడేరు మండలం పెన్నాడలో, కాళ్ళ మండలం కలవపూడిలో, పోడూరు మండలం గుమ్ములూరులో , మొగల్తూరు మండలం కాళీపట్నంలో పీహె చ్‌సీలు ఏర్పాటు చేయాల్సి ఉంది. సొంత భవనాల నిర్మాణం లేదు. అద్దె భవనాల్లో ఏర్పాటు చేయలేదు.

ఉద్యోగాలంటూ సొమ్ము కొట్టేశారు !





వెంటాడుతున్న అవినీతి దందా
ఉద్యోగాల పేరుతో వసూళ్లు
మోసపోయిన యువత
రూ.కోట్ల మేర దోపిడీ
బయటపడుతున్న బాధితులు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

తాడేపల్లిగూడెంలో అధికార పార్టీ నేతకు అవినీతి దందా వెంటాడుతోంది. బాధితులు ఒక్కొక్కరుగా బయట పడుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ గడచిన ఐదేళ్లలో కోట్ల రూపాయలు వసూలు చేశారు. అధికార పార్టీ నేత పేరుతో మధ్యవర్తులు సొమ్ములు తీసు కున్నారు. ఆ మొత్తాన్ని నేతకు ఇచ్చినట్టు చెపుతున్నారు. ఉద్యాన విశ్వవిద్యాలయంలో ఉద్యోగాలు కల్పిస్తామంటూ దెందులూరులో యువత నుంచి దాదాపు రూ. 2 కోట్ల మేర వసూళ్లకు పాల్పడ్డారు. ఆ నేతకు ప్రభుత్వంలోనూ, విశ్వ విద్యాలయంలోనూ పట్టు ఉందన్న భావనతో యువత మోసపోయారు. నేత ఎక్కడికి వెళితే అక్కడకు తన సొంత కారులో వెళుతూ కలియతిరిగిన యువ నాయకుడు దెందులూరు యువకుల నుంచి సొమ్ములు వసూలు చేశాడు. చివరకు ఉద్యోగాలు ఇవ్వలేదు. సొమ్ములు ఇవ్వలేదు. దెందులూరు యువకులు నిరసనలు చేపట్టారు. అయినా ఫలితం లేకపోయింది. సొమ్ములు తీసుకోవడంలో మధ్యవర్తిత్వం వహించిన వైసీపీ యువ నాయకుడు ముఖం చాటేశాడు. అధికార పార్టీ నేత నుంచి పెద్దగా స్పందన లేకుండా పోయింది. ఎట్టకేలకు సొంత సొమ్ములు ఇచ్చేందుకు మధ్యవర్తి అంగీకరించాడు. కొంతమేర ముట్ట చెప్పాడు. ఇదే తరహాలో ఎపినిట్‌లోనూ ఉద్యోగాలు కల్పిస్తా మంటూ ఓ 15 మంది అభ్యర్థుల నుంచి సొమ్ములు వసూలు చేశారు. ఒక్కో అభ్యర్థి నుంచి రూ. 5. లక్షల నుంచి రూ. 15 లక్షల వరకు సొమ్ములు వసూలు చేశారు. అదే యువనాయకుడు సొమ్ముల వసూలులో కీలక పాత్ర వహించాడు. రెండు విద్యా సంస్థల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ వసూలు చేసిన నియోజకవర్గ ముఖ్యనేతకు ఇచ్చేశామంటూ మధ్యవర్తి చెపుతున్నాడు. ఏపీ నిట్‌లోనూ ఉద్యోగాలు ఇవ్వలేదు. అభ్యర్థుల నుంచి ఒత్తిడి రావడంతో దొంగ పత్రాలను చేతికిచ్చారు. మోసపోయామంటూ అభ్యర్థులు లబోదిబోమంటున్నారు. మధ్యవర్తిత్వం వహించి నియోజకవర్గ నేతకు సొమ్ములు ముట్ట చెప్పిన యువ నాయకుడు ఇప్పుడు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నాడు. అధికార పార్టీ నేతతోనూ చెడింది. నేత చుట్టూ తిరగడం మానేశాడు. తిరిగి సొమ్ములు ఇచ్చేస్తామంటూ అభ్యర్థులకు సర్దిచెప్పడంలో మధ్యవర్తి తలమున కలయ్యారు. ఇదే తరహాలో వైద్య ఆరోగ్య శాఖలోనూ నర్సు పోస్టులు ఇప్పిస్తామంటూ అనేక మంది సొమ్ములు వసూళ్లకు పాల్పడ్డారు.

ఆరోగ్య శాఖలో ఉద్యోగాలంటూ మోసం

తాడేపల్లిగూడెం రూరల్ మండలం మాధవరం గ్రామానికి చెందిన వ్యక్తి కొంతమంది నుంచి సొమ్ములు తీసుకున్నాడు. తాడేపల్లిగూడెంలో అధికార పార్టీ నేతకు సన్నిహితంగా ఉన్న ఓ కుటుంబం కూడా సొమ్ములు వసూలు చేసింది. ఒక్కో మహిళా అభ్యర్థి నుంచి గరిష్టంగా రూ. 5 లక్షలు తీసుకు న్నారు. అందులో లక్ష రూపాయలు మధ్యవర్తిత్వం వహించిన వారు ఉంచుకున్నారు. మిగిలిన రూ. 4 లక్షలు అధికార పార్టీ నేతకు ముట్ట చెప్పారు. కరోనా సమ యంలో ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖలో రెగ్యులర్ ఉద్యోగాలను భర్తీ చేసింది. అధికార పార్టీ నేతకు సొమ్ములు ఇచ్చిన ఏ ఒక్క మహిళా అభ్యర్థికి ఉద్యోగం రాలేదు. దాంతో కరోనా కాలంలో నియమించిన కాంట్రాక్ట్ నియామకంలో ఉద్యోగాలు కల్పించారు. కరోనా సేవలు ముగిసిన తర్వాత వారికి ఉద్యోగాల నుంచి తొలగించారు. కాంట్రాక్ట్ ఉద్యోగం ఏమి టంటూ నిలదీసిన అభ్యర్థులకు మున్ముందు ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామంటూ నమ్మబలికారు. కాలం ముగిసింది. ఎన్నికలు తరము కొస్తున్నాయి. అధికార పార్టీ నేత హవాకు చెక్ పడే సమయం ఆసన్న మైంది. దాంతో సొమ్ములు ఇచ్చిన అభ్యర్థులంతా గగ్గోలు పెడుతున్నారు. అధికార పార్టీ నేత బాధితుల్లో దళిత మహిళలు కూడా ఉన్నారు. ఉద్యోగాల పేరుతోనే మధ్యవర్తులు దాదాపు రూ. 6 కోట్ల మేర వసూళ్లు చేశారు. ఇదే ఇప్పుడు నియోజకవర్గంలో చర్చగా మారింది.



ఎంపికైన బాలుర, బాలికల జట్ల క్రీడాకారులు

బాస్కెట్‌బాల్ పోటీలకు జట్ల ఎంపిక

ఏలూరు స్పోర్ట్స్, ఏప్రిల్ 14 : నూజివీడులో ఈనెల 19 నుంచి 22వ తేదీ వరకు జరిగే 9వ అంతర్‌జిల్లాల బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా బాలబాలికల జట్లను ఏలూరులో ఎంపికపోటీలు నిర్వహించామని బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు జి.కృష్ణారెడ్డి, గవ్వా శ్రీనివాసరావు తెలిపారు. జూనియర్ బాలుర జట్టులో సీహెచ్ ధోని, ఎస్.కిషోర్, ఎ.ఈశ్వర్‌తేజ, ఎన్.సందీప్, సీహెచ్ తేజసత్యనారాయణ, ఎం.సోమశేఖర్, వి.తేజ, మణీంద్ర, ఎం.సాంబసూర్య, ఎస్.జాన కీరామ్, డి.భరత్, వి.భానుప్రకాష్, ఎన్.ప్రభుకుమార్, స్టాండ్‌బైగా వి.చార్లెస్‌వెస్లీ, ఎ.ఎం.కె రామ్‌శెట్టి, జి.వరప్రసాద్, ఎస్‌కే జాఫర్, జూనియర్ బాలికల జట్టులో పి. నాగవినయ్‌శ్రీ, డి.పావనిప్రియ, ఎ.పూర్ణచంద్రిక, వై.యామిని, పి.నందిని, పి.జయశ్రీ, ఎ.రుత్విక, జి.పూజిత, డి.సాయిభవాని, ఎ.జయశ్రీ, పి.రాణి, సి.కీర్తి, స్టాండ్‌బైగా డి.అమృత, జి.ఏసమ్మ, బి.అమృతవర్షిణి, టి.జోషికలను ఎంపిక చేశామన్నారు.

సోషల్ మీడియాలో కథనాలపై ప్రత్యేక దృష్టి

▸▸ పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



భీమవరం: ఏప్రిల్ 14 : సార్వత్రిక ఎన్నికల సమయంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్టులో భాగంగా సోషల్ మీడియాలో ప్రసారమయ్యే కథనాలపై ఎన్నికల కమిషన్ ప్రత్యేక దృష్టి సారించి పర్యవేక్షిస్తోందని జిల్లా ఎన్నికల అధికారి, పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాను సారం ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం), లా అండ్ ఆర్డర్, ఎన్నికల సమగ్రత, ఎన్నికల ప్రణాళిక, నిర్వహణ తదితర అంశాలపై నకిలీ కథనాల ప్రచురణ, ప్రసారాన్ని ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించడంగా పరిగణించబడుతుందని తెలిపారు. ద్వేషపూరిత ప్రసంగం, తప్పుడు సమాచారం, నకిలీ వార్తలు మొదలైన సందేశాలు సోషల్ మీడియాలో ప్రసారమైతే అలాంటి వాటిని చట్టవ్యతిరేకమైన సందేశాలుగా గుర్తించి సంబంధిత సందేశాలను పోస్టు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎటువంటి సందేశాలు.. ఎలాంటి చట్ట వ్యతిరేకతకు దారితీస్తాయి, అందుకు కారకులైన వారికి చట్టపరంగా ఏయే సెక్షన్లు వర్తిస్తాయి? అనేది గుర్తించి జైలుశిక్ష లేదా జరిమానా లేదా రెండింటిని అమలు చేస్తామన్నారు.

ముగిసిన టెక్‌జెట్-24

నూజివీడు, ఏప్రిల్ 14: ఆర్జీయూకేటీ పరిధిలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న టెక్‌జెట్-24 టెక్నో మేనేజ్‌మెంట్ ఎక్స్‌పో ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా పీయూసీ విభాగం నుంచి 35 మంది విద్యార్థులు మెటావర్స్ ఆర్ట్ ఎక్స్‌పో కార్యక్రమంలో పాల్గొన్నారు. వివిధ విభాగాల నుంచి పలు సాంకేతిక ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శనకు ఉంచారు. నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ చంద్రశేఖర్, ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ గోపాలరాజు, సెంట్రల్ డీన్ శ్రావణి, ఏవో టి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



టెక్‌జెట్‌లో ప్రాజెక్టులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం

పాలకొల్లుఅర్బన్, ఏప్రిల్ 14 : అగ్నిమాపకవారోత్సవాల సందర్భంగా స్థానిక ఫైర్ స్టేషన్ వద్ద సహాయజిల్లా అగ్నిమాపక అధికారి వైవీ జానకీరామ్ పర్యవేక్షణలో ఆదివారం ఉదయం సిబ్బంది పరేడ్ చేసి, విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులర్పించారు. అనంతరం ఫైర్ కార్‌తో ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అగ్ని ప్రమాదాలు నివారణపై ముద్రించిన కరపత్రాలను పట్టణంలో ప్రజలకు పంపిణీ చేశారు.



ఆకివీడులో అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభిస్తున్న డెంటల్ వైద్యుడు కిరణ్

- నరసాపురం టౌన్: ప్రజల్లో అగ్ని ప్రమాదాల నివారణ, ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కల్పించినప్పుడే ప్రమాదాలు నివారించవచ్చని అగ్నిమాపక అధికారి బాస్కరరామ్ అన్నారు. ఆదివారం పట్టణ ఫైర్ కార్యాలయంలో అగ్నిమాపక వారోత్సవాలను ప్రారంభించారు. సిబ్బందితో కలిసి కరపత్రాలను విడుదల చేశారు. ఈనెల 20 వరకు జరిగే వారోత్సవాల్లో భాగంగా ప్రజల్లో ప్రమాదాల నివారణపై చైతన్యపర్చాలని పిలుపునిచ్చారు.
- ఆకివీడు : అగ్ని ప్రమాదాలు పట్ల ప్రతీ ఒక్కరూ చైతన్యవంతులు కావాలని సూర్య హాస్పటల్ అధినేత కనుమూరి కిరణ్ అన్నారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో అగ్నిమాపక వారోత్సవాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. అగ్నిప్రమాదాలు నివారించి దేశప్రగతికి తోడ్పడాలన్నారు.కార్యక్రమంలో అగ్నిమాపకశాఖాధికారి నాగేశ్వరరావు సిబ్బంది ఉన్నారు.

నేటి నుంచి సీతారామస్వామి కల్యాణోత్సవాలు


కలిదిండి, ఏప్రిల్ 14 : అపర భద్రాద్రి తాడినాడరామాలయంలో స్వామివారి కల్యాణోత్సవాలు ఈనెల 15 నుంచి 18 వరకు నిర్వహిస్తున్నామని ఆలయ ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు. 17న ఆలయ చైర్మన్ అల్లూరి శివాజీ దంపతులు కల్యాణం నిర్వహిస్తారన్నారు. ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఉత్సవాల్లో పోలీస్ బందోబస్తు నిర్వహిస్తున్నామని ఎస్ఐ ప్రియకుమార్ తెలిపారు.





14-04-2024 పొగాకు ధరలు (రూ.)	పొగాకు కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం	సరాసరి
	దేవరపల్లి	243	225	235.60
	జంగారెడ్డిగూడెం-1	244	235	240.40
	జంగారెడ్డిగూడెం-2	243	235	239.99
	కొయ్యలగూడెం	244	235	240.56
	గోపాలపురం	245	235	239.88

పోలవరంలో సమస్యల తిష్ఠ



పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందాన మండల కేంద్రమైన పోలవరం పరిస్థితి మారింది. పోలవరంలో ప్రాజెక్టు నిర్మాణం జరుగుతుంది, పర్యాటకం అభివృద్ధి చెంది పదిమందికి ఉపాధి దొరుకుతుందని ఆశించిన పోలవరం ప్రజల ఆశలు అడియాశలయ్యాయి. ప్రాజెక్టు నిర్మాణం పేరిట 23 గ్రామాల్లోని సుమారు మూడు వేల మందికి పైగా నిర్వాసిత కుటుంబాలను ఇతర మండలాలకు తరలించారు. ఈ మేరకు మండల జనాభా తగ్గి వ్యాపారాలు, సాగు భూముల విస్తీర్ణం తగ్గి ఆర్థిక వ్యవస్థ దెబ్బతింది.

అభివృద్ధికి ఆమడ దూరం..

▸▸ పునరావాసం పేరుతో జనాభా తరలింపు..

▸▸ సాగు భూముల విస్తీర్ణం తగ్గి దెబ్బతిన్న ఆర్థిక వ్యవస్థ

▸▸ మూతపడే స్థాయికి పట్టిసీమ ఎత్తిపోతల పథకం

- పోలవరం

జిల్లాల ఏర్పాటు అనంతరం నియోజకవర్గ కేంద్రంగా నిత్యం జనసమూహంతో ఉండే పోలవరం బోసి పోయింది. ప్రభుత్వ ప్రధాన కార్యాలయాలు సైతం పక్క మండలాలకు తరలిపోవడంతో ప్రజాప్రతినిధులు, అధికారులకు పోలవరం మండలంపై శ్రద్ధ తగ్గి పూర్తిస్థాయిలో అభివృద్ధి కుంటుపడింది. ప్రస్తుత ప్రభుత్వ పాలనలో పోలవరంలో ఏర్పాటు కావాల్సిన వంద పడకల మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, డిగ్రీ కళాశాల పక్క మండలాలకు తరలించడం పట్ల ప్రజలు అసంతృప్తి జ్వాలలతో రగిలిపోతున్నారు. నియోజకవర్గ కేంద్రంగా నామినేషన్ల ప్రక్రియ పోలవరంలో కొనసాగే విధానాన్ని మార్చి ఐటీడీఏ వద్ద ఏర్పాటు చేయడం పట్ల పలువురు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు.

నెక్లెస్ బండ్ ఇక్కట్లు

పోలవరం గ్రామానికి రక్షణగా 2009లో నిర్మించిన నెక్లెస్ బండ్ అరకొరగా నిర్మించి వదిలేయడం వల్ల వరదల సమయాలలో మండల కేంద్రంలో సగానికిపైగా జనాభా ప్రాణాలు గుప్పిట పెట్టుకుని జీవించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. వరదల సమయంలో ఆర్భాటం చేసి ఇసుక బస్తాలు వేసి వెళ్లిపోయే అధికారులు, ప్రజా ప్రతినిధులు సాధారణ రోజుల్లో నెక్లెస్ బండ్ పునరుద్ధరణ గురించి పట్టించుకున్న దాఖలాలే లేవు. నెక్లెస్ బండ్ నిర్మాణం వల్ల మృతదేహాల దహనాలకు శ్మశానమే లేక మృతుడి బంధువులు వేగేశ్వరపురం, కొవ్వూరు ప్రాంతాలకు వాహనాలపై తరలించాల్సిన పరిస్థితులు వచ్చాయి. గత 15 ఏళ్లగా ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నా ప్రజాప్రతి నిధులు, జిల్లా అధికారులు, రాష్ట్ర ముఖ్యమంత్రికి సైతం మొరపెట్టుకున్నా శ్మశానం లేని దుస్థితి తలెత్తిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెక్లెస్ బండ్‌కి పొడవునా మేజర్ డ్రెయిన్ నిర్మించకపోవడం వల్ల గ్రామం నీటమునిగి చెరువుని తలపిస్తుందని డ్రెయినేజీలు నిర్మించాలని ప్రజలు కోరినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



నెక్లెస్ బండ్

నిలిచిన పోలవరం ప్రాజెక్టు పనులు

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే బాగుంటుందని భావించిన స్థానిక ప్రజల ఆశలు కూడా ప్రాజెక్టు నిర్మాణం అర్ధంతరంగా నిలిచిపోవడంతో ఆశలు సన్నగిల్లాయి. పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా సాగు, తాగునీరు అంది మండలంలోనే గాక రాయలసీమ వరకు లక్షల ఎకరాలకు నీరందించి వ్యవసా యాలు మూడు పంటలుగా వర్ధిల్లేది కాస్తా పట్టిసీమను ప్రభుత్వం పడకే యించింది. పంటలకు సాగునీరు లేక రైతులు పంట విరామం పాటించే పరిస్థితులు నెలకొన్నాయి. వర్షాలు ఆశించిన స్థాయిలో లేక గోదావరిలో నీరు కరువై స్థానిక పంపింగ్ స్కీంలు నీరు లేక మూతపడే స్థాయికి చేరుకుని చేతి కందే పంటలు ఎండిపోయి రైతులు నష్టపోయే పరిస్థితులు ఎదురయ్యాయి.

ప్రత్యేక జిల్లా వచ్చేనా ?

పోలవరం ప్రాజెక్టు నిర్మాణానంతరం ప్రాజెక్టు ఎగువ 23 గిరిజన గ్రామాలు ఇతర మండలాలకు తరలిపోవడం, మండలంలో జనాభా తగ్గి వర్తక, వ్యాపారాలు లేక ఆర్థిక వ్యవస్థ దెబ్బతినడంతో పోలవరాన్ని ప్రత్యేక జిల్లాగా జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలని ప్రజానికం కోరుతున్నారు. పోలవరం జిల్లా సాధన కమిటీలు గత కొన్ని రోజులుగా మహాసభలు నిర్వహించి ప్రత్యేక జిల్లా కేంద్రం సాధనపోరాటం కోసం ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. రెండు నెలల క్రితం ఏజెన్సీ గిరిజన మండలాల ప్రజలు ఏడు వేల మందితో పోలవరంలో స్థానిక ఏటిగట్టు సెంటర్ పోలవరం ప్రాజెక్టు ముఖద్వారం వద్ద మహాసభ నిర్వహించారు. ఆ సభలో పోలవరం ప్రాజెక్టు పూర్తయితే పర్యాటకంగా అభివృద్ధి జరుగుతుందని చర్చించి జిల్లా కేంద్రం ఏర్పాటు కోసం అధికార, ప్రతిపక్ష పార్టీలను, ప్రజా సంఘాలను పిలిచి విన్నవించారు. ఎన్నికల హామీలలో సైతం అధికార, ప్రతిపక్షాలకు చెందిన పలువురు నేతలు హామీలు ఇచ్చారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడి ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎన్నికల అనంతరం రానున్న ప్రభుత్వ పాలనలో పోలవరం జిల్లా, జిల్లా కేంద్రం ఆశలు నెరవేరేనా లేదా అనే విషయంలో వేచి చూడాల్సిందే.

అత్యంత కట్టుదిట్టంగా ఈవీఎంల తరలింపు

▸▸ జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేశ్

ఏలూరుసిటీ, ఏప్రిల్ 14: ఏలూరు జిల్లా కలెక్టరేట్‌లోని ఈవీఎం గొడౌన్‌లో నిర్వహిస్తున్న ఈవీఎంల కేటాయింపు ప్రక్రియను జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వై.ప్రసన్నవెంకటేశ్ ఆదివారం పరిశీలించారు. మొదటి ర్యాండమైజే షన్ ప్రక్రియను ఆన్‌లైన్ ద్వారా రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గత శుక్రవారం నిర్వహించి పార్లమెంట్ అసెంబ్లీ సెగ్మెంట్స్, అసెంబ్లీ నియోజక వర్గాల వారీగా పూర్తి చేశారు. దీనికి అనుగుణంగా శనివారం ఉదయం నుంచి స్థానిక ఈవీఎం గొడౌన్ వద్ద బీయూలు, సీయూలు, వీవీ ప్యాట్‌లను వరుసగా 120, 120, 130 దామాషాగా విభజించటం జరిగింది. ఏడు నియోజకవర్గాలు కలిపి పార్లమెంట్ అసెంబ్లీ సెగ్మెంట్స్, అసెంబ్లీ నియోజకవర్గాలకు మొత్తం బీయూలు 4,184, సీయూలు 4,184, వీవీ ప్యాట్స్ 4,534 తరలిస్తున్నారు. వీటిని జీపీఎస్ అమర్చిన టీజీటీ క్లోజ్డ్ వాహనాలలో పోలీస్ ఎస్కార్ట్‌తో పార్లమెంట్ అసెంబ్లీ సెగ్మెంట్స్, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా వేర్వేరు స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచేందుకు అత్యంత కట్టుదిట్టమైన బందోబస్తు మధ్య తరలించారు. ఇప్పటివరకు చింతలపూడి, పోలవరం, నూజివీడు, ఏలూరు, దెందులూరు, కైకలూరు నియోజకవర్గాలకు సంబంధించి ప్రక్రియ పూర్త యింది. నామినేషన్ల స్క్రూటినీ అనంతరం కమిషనింగ్ (ఈవీఎంలలో బ్యాలెట్ పేపర్ ఫిక్స్) చేయడం జరుగుతుంది. అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో సీలు వేసి మళ్లీ భద్రపరుస్తాం. చివరిగా రెండో ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించి పోలింగ్ స్టేషన్లు వారీగా తరలిస్తాం. పరిశీలన కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి, డీఆర్‌వో డి.పుష్పమణి, డిప్యూటీ కలెక్టర్ భానుశ్రీ, ఈవీఎం నోడల్ అధికారి వెంకటేశ్వర్లు, కలెక్టరేట్ ఏవో కె.కాశీవిశ్వేశ్వరరావు పాల్గొన్నారు.



కేఆర్‌పురం ఐటీడీఏ ప్రాంగణంలోని వైటీసీకి చేరుకున్న ఈవీఎంలు

ఐటీడీఏకు చేరుకున్న ఈవీఎంలు

బుట్టాయగూడెం, ఏప్రిల్ 14 : రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాష్ట్రంలో జరగబోయే అసెంబ్లీ, పార్లమెంటుకు సంబంధించిన ఈవీఎంలు ఆదివారం కేఆర్ పురం ఐటీడీఏకు వచ్చినట్టు ఐటీడీఏ పీవో, పోలవరం అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి ఎం.సూర్యతేజ తెలిపారు. బ్యాలెట్ యూనిట్స్ 340, కంట్రోల్ యూనిట్స్ 340, వీవీ ప్యాట్స్ 360 వచ్చాయన్నారు. ఆమోదం పొందిన జాతీయ, రాష్ట్ర పార్టీల నాయకుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లో పెట్టి సీలు వేశామన్నారు. సెంట్రల్ కమాండ్ ఫోర్స్, సీసీ కెమెరాలతో స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రత ఏర్పాటు చేశామని ఐటీడీఏ కార్యాలయం వైటీసీ కాంప్లెక్స్‌లో భద్రపరచినట్టు తెలిపారు.



బాదంపూడి ఊరు మధ్యలో ఉన్న రైల్వే గేటు మూసిన దృశ్యం

16 వరకు రైల్వే గేటు మూసివేత

▸▸ బాదంపూడి వాసులకు తప్పని ఇబ్బందులు

ఉంగుటూరు, ఏప్రిల్ 14 : బాదంపూడి వద్ద రైల్వే గేటు ఊరి మధ్యలో ఉండడంతో సహజంగానే గ్రామస్థులు ఇబ్బందులు పడుతూనే ఉంటారు. ఈ గేటు మీదుగా నిత్యం వెల్లమిల్లి, బాదంపూడి గ్రామస్థులు హైవేకి వెళ్లాల్సి రావడంతో స్థానికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వీటితో పాటు మరమ్మతుల పేరుతో గేటు మూసివేయడంతో మరిన్ని ఇబ్బందులు గ్రామస్థులకు తప్పడం లేదు. మరోవైపు మరమ్మతులు పూర్తికాలేదని రోజులు పెంచుకుంటూ వెళ్లడంతో వారి బాధలు వర్ణనాతీతం. రైల్వే ట్రాక్ మరమ్మతుల నిమిత్తం బాదంపూడి రైల్వే గేటును తొలుత ఈనెల 4 నుంచి 10వ తేదీ వరకు మూసివేశారు. మరమ్మతులు పూర్తి కాకపోవడంతో 11వ తేదీ నుంచి 14వ తేదీ వరకు పెంచగా ప్రస్తుతం ఈ పనులు కూడా పూర్తి కాకపోవడంతో మరోసారి ఈనెల 15వ తేదీ ఉదయం 7 గంటల నుంచి, 16వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు గడువు పెంచుతున్నామని తాడేపల్లిగూడెం సీనియర్ సెక్షన్ అధికారి ఎ.రవి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మొత్తం 13 రోజుల పాటు మరమ్మతులు జరపడంతో ఆయా గ్రామస్థులు, ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ సీజన్ కావడంతో రైతులు, పశువుల కాపరులు అవస్థలు వర్ణనాతీతం.

పూజల ఫలితమే అయోధ్య రామమందిర నిర్మాణం

▸▸ బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి చౌదరి

▸▸ యాజ్ఞవల్క్య రాజాశ్రమంలో అఖిల భారత మహాసభలు ప్రారంభం

పెదవేగి, ఏప్రిల్ 14 : లక్షలాదిమంది ప్రజల ప్రాణత్యాగం, ఎంతోమంది పూజల ఫలితమే అయోధ్య రామమందిన నిర్మాణమని తపన ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి(చౌదరి) అన్నారు. పెదవేగి మండలం ముండూరులోని యాజ్ఞవల్క్య రాజాశ్రమం 66వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన మూడు రోజులపాటు జరిగే వేదాంత మహాసభలను ఆయన ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. ఐదు వందల ఏళ్ల పోరాటం, వందేళ్ల న్యాయ పోరాటం, సాదు సంతులు చేసిన తపస్సు వెరసి.. అయోధ్య రామమందిర నిర్మాణమన్నారు. అయోధ్యలో భవ్యమైన, దివ్యమైన రామమందిర నిర్మాణం కారణజన్ముడైన ప్రధాని మోదీ ఆధ్వర్యంలో ప్రారంభమైందని పేర్కొన్నారు. బాలరాముని విగ్రహ ప్రతిష్ఠతో అయోధ్య పునీతమైందని, అంతటి మహద్భాగ్యం కలుగడం మనందరి పుణ్యఫలమన్నారు. యాజ్ఞవల్క్య రాజాశ్రమ పీఠాధిపతి శ్రీకృష్ణ చరణానందభారతి స్వామి మాట్లాడుతూ మూడు రోజులపాటు జరిగే ఈ వేదాంత మహాసభల్లో పలు ప్రాంతాలనుంచి వచ్చిన అఖండ జ్ఞానులు, పీఠాధిపతులు, ఆశ్రమాధిపతులు వేదాల సారాన్ని వినిపిస్తారని వివరించారు. తొలుత ప్రణవ పతాకావిష్కరణతో వేదాంత మహాసభలను గారపాటి చౌదరి ప్రారంభించారు. కార్యక్రమంలో జనసేన ఏలూరు ఇన్‌చార్జి రెడ్డి అప్పలనాయుడు, ఆశ్రమ స్వాములు ప్రణవానంద భారతిస్వామి, చిత్స్వరూపానందగిరి స్వామి, శంకరానందగిరి స్వామి, సత్యానందగిరి స్వామి, శ్రీమాతా శివానందగిరి స్వామి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



అఖిల భారత మహాసభలో మాట్లాడుతున్న తపనా చౌదరి



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆచార్యులు, విద్యార్థులు

అంబేడ్కర్ రాజ్యాంగం ప్రపంచానికే స్ఫూర్తి

▸▸ ఏపీ నిట్ డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డాక్టర్ వీరేష్‌కుమార్

తాడేపల్లిగూడెం అర్బన్, ఏప్రిల్ 14 : డాక్టర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం ప్రపంచానికే స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని ఏపీ నిట్ డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డాక్టర్ జీబీ. వీరేష్‌కుమార్ అన్నారు. ఆదివారం ఏపీ నిట్‌లో అంబేడ్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ సమాజానికి అందించిన సేవలు మరువలేనివన్నారు. ఎస్సీ, ఎస్టీ సెల్ లైజన్ ఆఫీసర్ డాక్టర్ వినోత్‌కుమార్‌రాజా మాట్లాడుతూ భారతదేశం గర్వించతగ్గ మహోన్నత వ్యక్తులలో అంబేడ్కర్ ఒకరని కొనియాడారు. కార్యక్రమంలో ఆచార్యులు డాక్టర్ వి.సందీప్, డాక్టర్ తపస్, డాక్టర్ రాముడు, డాక్టర్ భరణీధరన్, డాక్టర్ శ్రీనివాసన్, డాక్టర్ తలారిరేష్మ, డాక్టర్ సీహెచ్.శ్రీలత, డాక్టర్ సుదర్శన్ దీప పాల్గొన్నారు.

18న వలంటీర్ల మూకుమ్మడి రాజీనామా ?

పెదపాడు, ఏప్రిల్ 14 : మళ్లీ అధికారంలోకి రాగానే వలంటీర్ల దస్త్రంపైనే తొలి సంతకమని సీఎం జగన్ తెలిపినా.. రానున్న టీడీపీ ప్రభుత్వంలో వలంటీర్లకు తగిన గుర్తింపునివ్వడంతో పాటుగా ప్రస్తుతం అందుతున్న రూ.5 వేల వేతనానికి బదులుగా రూ.10 వేల వేతనం అందిస్తామని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెబుతున్నా.. రాష్ట్రవ్యాప్తంగా అక్కడక్కడ కొన్ని గ్రామాల పరిధిలోని కొంతమంది వలంటీర్లు రాజీనామాల బాట పడుతూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో పెదపాడు మండల పరిధిలో వలంటీర్లుగా విధులు నిర్వహిస్తున్న సుమారు 400 మంది వలంటీర్ల పయనమెటనేది ప్రశ్నగా మిగిలింది. ఇటీవల పెదపాడులో జరిగిన వైసీపీ మండలస్థాయి కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ ఈనెల 18న వలంటీర్లు రాజీనామాలు చేస్తామంటున్నారు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు రాజీనామా చేసిన వలంటీర్లందరిని ఈనెల 19న జరిగే నామినేషన్ ప్రక్రియలో పాల్గొనేలా చూడాలంటూ సూచించడంతో రాజీనామా అంశం మరోమారు తెరపైకి వచ్చింది. ఈక్రమంలో రాజీనామా చేయాలా.. వద్దా, భవిష్యత్తు ఏమిటనే దానిపై కొందరు వలంటీర్లు ఆలోచనలో పడ్డారు. మొత్తంమీద ఎంతమంది వలంటీర్ల రాజీనామాలు సమర్పించనున్నారనేది మరో మూడు రోజుల్లో స్పష్టం కానుంది.

వాహనాల తనిఖీల్లో అప్రమత్తంగా ఉండాలి

జీలుగుమిల్లి, ఏప్రిల్ 14:రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది వాహనాల తనిఖీల పట్ల అప్రమత్తంగా ఉండాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అసిస్టెంట్ కమిషనర్ కె.విజయ అన్నారు. జీలుగుమిల్లి మండలం తాటియాకులగూడెం వద్ద చెక్‌పోస్టును ఆమె పరిశీ లించారు. అక్రమంగా వాహనాల్లో ఇతర రాష్ట్రాల మద్యం, ఇతర ఎన్నికల సామగ్రి తరలిపోకుండా తనిఖీలు ఉండాలన్నారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇతర రాష్ట్రాల మద్యం ఒక బాటిల్ ఉన్నా శిక్షకు అర్హుల వుతారన్నారు. జంగారెడ్డిగూడెం ఎస్ఈబీ సీఐ పట్టాభి చౌదరి, ఎస్ఐలు కె.శేఖర్‌బాబు, జె.ఎలియాజర్, హెడ్‌కానిస్టేబుల్ సీతారాం, ఏఆర్ సిబ్బంది ఉన్నారు.



తాటియాకులగూడెం చెక్‌పోస్టు వద్ద అసిస్టెంట్ కమిషనర్ విజయ, సీఐ, ఎస్ఐలు

చింతలపూడి ఎస్ఈబీ స్టేషన్‌లో రికార్డుల పరిశీలన

చింతలపూడి, ఏప్రిల్ 14:చింతలపూడి ఎస్ఈబీ స్టేషన్‌ను ఎస్ఈబీ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాబోవు సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. ఎన్నికల దృష్ట్యా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులలో నమోదు చేసిన కేసుల వివరాలను సమీక్షించారు. సరిహద్దు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులు, అక్కడ నమోదైన కేసులను పరిష్కరించారు. స్టేషన్ ఇన్‌స్పెక్టర్ డి.ఎస్.ఎస్.వి ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యాన వర్సిటీలో అంబేడ్కర్ జయంతి

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 14: డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన వర్సిటీలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపకులపతి డాక్టర్ టి.జానకీరామ్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రిజిస్ట్రార్ బి. శ్రీనివాసులు వర్సిటీ అధికారులు, సిబ్బంది అంబేడ్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న వీసీ

క్రైం సమాచారం

పెళ్లి శుభలేఖలు ఇచ్చేందుకు వెళుతూ..

▸▸ మోటారు సైకిల్‌ను ఢీకొట్టిన ఆటో.. ఒకరి మృతి

పాలకొల్లు రూరల్, ఏప్రిల్ 14 : నరసాపురం రోడ్డులో ఆదివారం ఉదయం జరిగిన ప్రమాదంలో ఒక వ్యక్తి మరణించాడు. వివరాలివి.. నరసాపురం శ్రీహరిపేటకు చెందిన మురపాక సతీష్‌కుమార్(37) నరసాపురం నుంచి బంధువుల ఇంట్లో జరిగే పెళ్లి శుభలేఖలు ఇచ్చేందుకు పోడూరు మండ లం జగన్నాథపురానికి మోటారుసైకిల్‌పై వెళుతున్నాడు. దిగమర్రు దాటిన తరువాత రైస్ మిల్లు సమీపంలో ఆటో ఢీకొట్టడంతో అక్కడికక్కడే కిందపడి మరణించాడు. భార్య సన్యాసమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ డి.హరికృష్ణ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



సతీష్‌కుమార్ మృతదేహం

నేడు మహాగణపతి విగ్రహ ప్రతిష్ఠ

తణుకు, ఏప్రిల్ 14: తణుకు పట్టణంలోని సంత మార్కెట్ వద్ద గల పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో మహాగణపతి విగ్రహ ప్రతిష్ఠ పూజలు ఘనంగా జరిగాయి. ఆదివారం పట్టణానికి చెందిన పొన్నపల్లి శ్రీరామకృష్ణ శర్మ, రాజ్యలక్ష్మి, పొన్నపల్లి బాలసాయి విశ్వనాద్, లిఖిత దంపతులు పూజలు చేశారు. సోమవారం ఉదయం 11.15 గంటలకు స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ అనంతరం అన్నసమారాధన జరగనుంది. పట్టణ స్వర్ణకార సంఘం అధ్యక్షుడు పొడుగు రామాచారి, ఆలయ చైర్మన్ కొమ్మోజు రామకృష్ణ, ప్రధాన అర్చకులు కడియం అప్పలాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో పూజలు చేస్తున్న దృశ్యం



తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అందుకుంటున్న విద్యార్థులు

'గురుకుల పాఠశాల'కు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్

తాడేపల్లిగూ డెం రూరల్, ఏప్రిల్ 14: తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లి గురుకుల పాఠశాలకు ఆదివారం రెండు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సొంతం చేసుకున్నట్టు ప్రిన్సిపాల్ రాజారావు తెలిపారు. అంబేడ్కర్ జయంతి మాసోత్సవాల సందర్భంగా విద్యార్థులు తమ పాఠాలు తామే బోధించుకునే విధంగా వీడియోలు తీసి వారి తల్లిదండ్రులకు పంపించడంలో 3,600 ప్రాజెక్టులు చేసినట్టు వివరించారు. ఈ అంశంలో ఒక తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌తోపాటు, 500 మంది విద్యార్థులు అంబేడ్కర్ చిత్రపటాలు వేయడం ద్వారా మరో రికార్డు సాధించారని వివరించారు. సంబంధిత పత్రాలను తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అబ్జర్వర్ పి.శ్రీనివాస్ అందించారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.







పాలకొల్లులో అంబేడ్కర్ విగ్రహానికి మాలమహానాడు అధ్యక్షుడు నల్లి రాజేష్ నివాళులు.. నరసాపురంలో యువకుల నివాళులు.. జనసేన అభ్యర్థి అంజిబాబు.. పెనుమంచిలిలో ఆచంట టీడీపీ అభ్యర్థి పితాని.. మొగల్తూరులో రక్తదానం

మహోన్నత వ్యక్తి అంబేడ్కర్

ఘనంగా రాజ్యాంగ నిర్మాత జయంతి వేడుకలు



తాడేపల్లిగూడెంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వలవల బాబ్జి




పాలకొల్లులో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రామానాయుడు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ బీజేపీ, జనసేన శ్రేణులు... ఎన్ఆర్పీ అగ్రహారంలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రామరాజు



దువ్వలో అంబేడ్కర్‌కు నివాళులర్పించిన ఆరిమిల్లి తనయుడు నిఖిల్ రత్న

ఆచంట, ఏప్రిల్ 14: అణగారిన కులాల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేసిన మహోన్నత వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని టీడీపీ కూటమి అభ్యర్థి పితాని సత్యనారాయణ అన్నారు. పెనుమంచిలిలో అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్‌బాబు, కేతా మీరయ్య, ఎంపీపీ దిగుమర్తి సూర్య కుమారి, బీరా నరసింహమూర్తి, వర్ధనపు నవ మోహిని, సిర్రా బాలాజీ పాల్గొన్నారు. తూర్పుపాలెంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే రంగనాధరాజు అంబేడ్కర్ చిత్రపటానికి పూల మాలలు వేశారు.

పాలకొల్లు అర్బన్: భారత రాజ్యాంగ నిర్మాత, భారత రత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 133వ జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక గాంధీ బొమ్మల సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం, గాంధీబొమ్మల సెంటర్‌లోని అంబేడ్కర్ చిత్రపటాలు, విగ్రహాలకు నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు వై.శివాజీ, ఎమ్మెల్యే అభ్యర్థి కొలుకులూరి అర్జునరావు పాల్గొన్నారు. గాంధీ బొమ్మల సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల గోపి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ముందుగా పార్టీ కార్యాలయంలో చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు యడ్ల తాతాజీ, మేకా శేషబాబు, చందక సత్తిబాబు, కర్రా జయసరిత పాల్గొన్నారు. మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేష్ ఆధ్వర్యంలో బద్దావాని పేటలోని అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

నరసాపురం టౌన్: వైసీపీ కార్యాలయంలో చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, మునిసిపల్ కార్యాలయంలో కమిషనర్ వెంకటేశ్వరావు, మండల పరిషత్‌లో ఎంపీడీవో రమణారావు, దళిత సంఘాలు, సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్, జనసేన నాయకుల ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు నివాళులర్పించారు. చలవపేట యూత్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. మిఠాయిలు పంచిపెట్టారు.

భీమవరం అర్బన్: టీడీపీ కార్యాలయంలో అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పార్టీ జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి విచ్చేశారు. అనంతరం అంబేడ్కర్ సెంటర్లోని డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకులు కోళ్ళ నాగేశ్వరరావు, వేండ్ర శ్రీనివాస్, మెరగాని నారాయణమ్మ, మాదాసు కనకదుర్గ పాల్గొన్నారు. భీమవరం కాంగ్రెసు పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి అంకెం సీతారాం నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు పూల మాలలు వేశారు. అంబేడ్కర్ సెంటర్‌లోని కాంస్య విగ్రహానికి సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, నాయకులు చల్లబోయిన రంగారావు, అముల్యరావు నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.వాసుదేవరావు నివాళులు అర్పించారు.

ఆకివీడు: టీడీపీ మండల-పట్టణ అధ్యక్షులు మోటుపల్లి రామవర ప్రసాద్, బొల్లా వెంకట్రావు పెదపేటలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. మాజీ సర్పంచ్ గొంట్లా గణపతి, పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి గంధం ఉమా, క్రైస్తవ నేతలు మద్దా నరేష్, పాస్టర్ జోసఫ్‌రాజు, పమ్ము, కౌన్సి లర్లు బొల్లా వీరశ్వేత, బత్తుల శ్యామల, అజ్మల్, రామరాజు, జాకీర్ పాల్గొన్నారు. నగర పంచాయతీ ఛైర్మన్ జామి హైమావతి మెయిన్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో యద్దనపూడి రామకృష్ణ, ఫైయింగ్ అధికారి, సూపరింటెండెంట్ శ్రీకర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

భీమవరం రూరల్: ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. ముఖ్య అతిథి జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ హాజరై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో భీమవరం ఆర్డీవో కె.శ్రీనివాసులురాజు, అసోసియేషన్ అధ్యక్షులు డా.ఎ వీరయ్య, శ్రీవిజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, తదితరులు పాల్గొన్నారు.

● డా.బీఆర్ అంబేడ్కర్ దేశానికి చేసిన సేవలు ఎనలేనివని పీఆర్టీయు పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు ముక్కు సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కాళ్ళ: ఏలూరుపాడు, దొడ్డనపూడి, కాళ్ళ, సీసలి గ్రామాల్లో నిర్వహించిన వేడుకల్లో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జుత్తిగ నాగరాజు పాల్గొని అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జనసేన మండలాధ్యక్షుడు ఎరుబండి రామాంజనేయులు, సర్పంచ్ బందా విజయ, ఆరేటి దిలీప్, తదితరులు పాల్గొన్నారు. పెదఅమిరం, కోలనపల్లిలో డీసీసీబీ మాజీ ఛైర్మన్ పీవీఎల్ నరసింహ రాజు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

భీమవరం టౌన్: అంబేడ్కర్ జయంతి కార్యక్రమాన్ని జనసేన, బీజేపీ, టీడీపీ ఉమ్మడి ఎన్నికల శిబిరంలో నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే అంజిబాబు, జనసేన పట్టణ అధ్యక్షుడు చెన్నమల చంద్రశేఖర్,నాయకులు బండి రమేష్ కుమార్, కత్తుల నిలేంద్ర, వా నపల్లి సూరిబాబు, కోళ్ల నాగేశ్వరరావు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ మెరగాని నారాయణమ్మ పాల్గొన్నారు.

● అంబేడ్కర్ జయంతిని బీజేపీ ఎన్నికల కార్యాలయంలో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఇంజేటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నరసాపురం పార్లమెంట్ అభ్యర్థి భూపతి రాజు రాజు శ్రీనివాస్ వర్మ, రాష్ట్ర క్రమశిక్షణ సంఘం అధ్యక్షుడు పాకా వెంకట సత్యనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పీవీ రాఘవులు అంబేడ్కర్ చిత్ర టానికి పూల మాలలువేసి నివాళులు అర్పించారు.

పెనుగొండ: పెనుగొండలో సర్పంచ్ నక్కా శ్యామలా సోని శాస్త్రి అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులుఅర్పించారు. భారీగా ఊరేగింపు నిర్వహించారు. నక్కా వేద వ్యాస శాస్త్రి, పులిగోరు రవి కుమార్, రొక్కాల సురేశ్ కుమార్, వేండ్ర రాము పాల్గొన్నారు.

పెనుమంట్ర: మార్టేరులోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, వ్యవసాయ పాలిటెక్నిక్‌లలో అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇన్‌ఛార్జీ ఎ.డి.ఆర్. డా. టి. శ్రీనివాస్ అధ్యక్షత వహించారు.

గణపవరం: గణపవరంలో అంబేడ్కర్ విగ్రహానికి టీడీపీ పట్టణ అధ్యక్షుడు కూసంపూడి సురేంద్రకుమార్‌రాజు, జనసేన మండల నాయకుడు తోట శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ప్రిన్సిపాల్ నిర్మలకుమారి, అర్ధవరంలో ఎంపీపీ దండు రాము, కేవీపీఎస్ మండల కార్యదర్శి చిన నాగేశ్వరరావు, సర్పంచ్ సుజాత, అప్పన్నపేటలో టీడీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి యాళ్ళ సుబ్బారావు అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పాలకొల్లు టౌన్: గాంధీబొమ్మల సెంటర్లోని అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే రామానాయుడు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి బోనం చినబాబు, రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు ఉన్నమట్ల కబర్ధి, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి పెచ్చెట్టి బాబు, జీవీ, బత్తుల మేరీ నిర్మల కుమారి, ఉన్నమట్ల ప్రేమ్‌కుమార్, ఉండుర్తి సురేష్ తదితరులు పాల్గొన్నారు

మొగల్తూరు: అంబేడ్కర్ జయంతి పురస్కరించుకుని మొగల్తూరులోని రామకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం నిర్వహించారు. సుమారు 40 మంది నుంచి రక్తం సేకరించారు. ట్రస్ట్ వ్యవస్థాపకుడు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోడూరు: గుమ్మలూరు శివారు రావిగొప్పులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాలను రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడు చెల్లెం ఆనందప్రకాష్, సర్పంచ్ గొట్టుముక్కల సోనియా రమేష్ ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ కుక్కల దుర్గారావు, గంగోలు శ్రీను, ఈతకోట భాస్కరరావు, ఆకుమర్తి ప్రసాద్, దిద్దే శ్రీను, వడ్లపాటి సురేష్ పాల్గొన్నారు.

ఉండి: ఎన్‌ఆర్‌పిఅగ్రహారంలోని డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఎంపీ రఘురామ కృష్ణంరాజు, ఎమ్మెల్యే రామరాజు పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన డా.బిఆర్ అంబేడ్కర్ కమిటికి చెందిన నాయకులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం అర్బన్: అంబేడ్కర్ దేశ సేవలు మరువలేనివని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి అన్నారు. పట్టణంలోని పోలీస్ ఐలాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తొలుత పార్టీ కార్యాలయంలో ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గొర్రెల శ్రీధర్, పట్నాల రాంపండు, కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న, ముప్పిడి రమేష్ తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని పోలీస్ ఐలాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే ఈలి నాని పూలమాల వేసి నివాళులర్పించారు.

తణుకు: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఆశయాల అమలు చేసేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి కట్టుబడి ఉందని తణుకు నియోజకవర్గ కూటమి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ తనయుడు నిఖిల్ రత్న అన్నారు. ఆదివారం అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని దువ్వ, ముద్దాపురం, వేల్పూరు, ఇరగవరం, కంతేరు గ్రామాల్లో పర్యటించి అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

శాకాంబరేశ్వరునిగా అయ్యప్ప స్వామి



పాలకొల్లు అర్బన్, ఏప్రిల్ 14: స్థానిక నరసాపురంలోని శ్రీ అయ్యప్పస్వామిని ఆదివారం కూరగాయలతో శాకాంబరేశ్వరునిగా అలంకరించారు. కేరళలో అత్యంత వైభవంగా జరుపుకునే విశ్వపండగను పురస్కరించుకుని ఉదయం లక్ష్మీగణపతి హోమం నిర్వహించి, స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు.

8,9వార్డుల్లో జనసేన ప్రచారం



ప్రచారం చేస్తున్న నాయకర్ సతీమణి సునీత

నరసాపురం టౌన్, ఏప్రిల్ 14: పట్టణంలోని 8,9 వార్డుల్లో ఆదివారం జనసేన అభ్యర్థి బొమ్మిడి నాయకర్ విజయం కోరుతూ ఆయన సతీమణి సునీత ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. టీడీపీ, బీజేపీ నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. కొల్లు పెద్దిరాజు, కొప్పాడ రవి, గుగ్గిలపు బుజ్జీ, ఎం.సత్యకృష్ణ, కోటిపల్లి వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

చాంబర్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం



పాలకొల్లు అర్బన్, ఏప్రిల్ 14 : స్థానిక ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీస్ కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఆదివారం ఛాంబర్ భవనంలో జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఛాంబర్ అధ్యక్షుడు కేవీఆర్ నరసింహారావు అధ్యక్షత వహించి, నూతన కార్యవర్గ సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రధాన కార్యదర్శిగా కనుమూరి వెంకట సీతారామరాజు, కోశాధికారిగా మామిడి వెంకటేశ్వరరావు (బాబు) ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం పాలక వర్గంలోని అనుబంధ విభాగాలనుండి ఎన్నికైన కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. గౌరవాధ్యక్షులుగా వేగేశ్న రంగరాజు, పెద్దిబోట్ల లక్ష్మీ నారాయణ. గౌరవ సలహాదారులుగా గుణ్ణం సర్వారావు, కలిదిండి సూర్యనారాయణ రాజు, ఛాంబర్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఛైర్మన్‌గా తటవర్తి కృష్ణ మూర్తి, సెక్రటరీ కరస్పాండెంట్‌గా కలిదిండి రామరాజు, కోశాధికారిగా ఆర్ఎస్‌వీఆర్ ప్రవీణ్ భాను ప్రమాణ స్వీకారం చేశారు.

ఆకట్టుకున్న అవధానం

భీమవరం టౌన్, ఏప్రిల్ 14: ఆర్యవైశ్య వర్తక సంఘం (త్యాగరాజు భవనం)లో చిన్మయ ప్రభ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అష్టావధాన కార్యక్రమాన్ని ఆనంద ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఉద్దరాజు కాశి విశ్వనాథరాజు ప్రారంభించారు. ఈ అష్టావధాన కార్యక్రమంలో సమాజంలో జరుగుతున్న అనేక అంశాలతోపాటు రాజకీయ విషయాలపై కూడా అవధాని ఉప్పల దడియం భరత్ శర్మ సమాధానాలు అందించారు. విశ్లేషకులుగా డాక్టర్ కడిమిళ్ల వరప్రసాద్ వ్యవహరించగా, ప్రాస్నికులుగా కవులు ఇందుకూరి లక్ష్మీపతి రాజు, కడిమిళ్ళ ధూళిపాల ఆర్య సోమయాజి, దాయిన సురేష్ చంద్రజీ, అక్కిపెద్ది రామ సూర్యనారాయణ, చక్రావధానుల రెడ్డప్ప దవేజీ తదితరులు వ్యవహరించారు.

సమస్యలు పరిష్కరిస్తా

భీమవరం టౌన్, ఏప్రిల్ 14 : వాకర్స్‌కు ఎటువంటి సమస్య వచ్చినా వాటి పరిష్కార మార్గానికి ఒక్క పిలుపు చాలు వెంటనే స్పందిస్తానని జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు అన్నారు. భీమవరం వీరమ్మ పార్కు వద్ద వాకర్సు సభ్యులను ఆయన కలిసి మాట్లాడారు. ప్రశాంతమైన భీమవారన్ని సాధించుకుందామని, భీమవరం నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామని అన్నారు.

చలివేంద్రం ప్రారంభం

భీమవరం రూరల్, ఏప్రిల్ 14 : పట్టణంలో 25వ వార్డులో ఆదివారం వైసీపీ నాయకులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్ ప్రారంభించారు. కార్యక్రమంలో పోతుల జక్రి, యురవి, బన్ను, బాలు, నాని, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య పరీక్షలు

యలమంచిలి, ఏప్రిల్ 14: తాను పుట్టిన ఊరుకి, ప్రజలకు సేవలందించడం అదృష్టంగా బావిస్తున్నానని డాక్టర్ తరపట్ల వెంకటేశ్వరరావు అన్నారు, అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని తాడి శశికిరణ్ కె.నానిబాబు ఆధ్వర్యంలో ఆర్యపేట గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. డాక్టర్. ఉమావల్లి సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

ఘనంగా టీబీఆర్ వార్షికోత్సవం



ఎంపీ అభ్యర్థి శ్రీనివాసవర్మ కు మెమెంటో అందజేస్తున్న టీబీఆర్ ఛైర్మన్ భోగేశ్వరరావు

పెంటపాడు, ఏప్రిల్ 14: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని నర్సాపురం ఎంపీ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాస వర్మ, నియోజకవర్గ కూటమి అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్, బీజేపీ కన్వీనర్ ఈతకోట తాతాజీ అన్నారు. అలంపురం టీబీఆర్ సైనిక్ స్కూల్లో అధినేత భోగేశ్వరరావు ఆధ్వర్యంలో పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. అపుస్మా అధ్యక్షుడు గుణ్ణం బుల్లబ్బాయి, ఎంఈవో రామకృష్ణ మాట్లాడుతూ విద్యతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఏర్పాట్లను సీఈవో రవికిరణ్ పర్యవేక్షించారు. నియోజకవర్గ ఎక్స్ సర్వీస్‌మెన్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.వీరయ్య, బీవీఆర్ కళాకేంద్రం అధ్యక్షుడు బుద్దాల వెంకట రామారావు, కరస్పాండెంట్ పద్మావతి, ప్రిన్సిపాల్ బాలమురళి, హెచ్ఎం కళ్యాణి, ఏవో నాగరాజు పాల్గొన్నారు.

'కాపులకు ద్రోహం చేసిన వైసీపీ'



మాట్లాడుతున్న కాపు జేఏసీ నాయకుడు ఆకుల రామకృష్ణ

తణుకు, ఏప్రిల్ 14: కాపులకు ద్రోహం చేసిన పార్టీ వైసీపీ అని కాపు జేఏసీ నాయకుడు ఆకుల రామకృష్ణ ఆరోపించారు. ఆదివారం తణుకులో కాపు సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బసవ రామకృష్ణ ఆధ్వర్యంలో విలేకరులతో మాట్లాడుతూ కాపు కార్పొరేషన్, విదేశీ విద్య, అయిదు శాతం ఈడబ్ల్యుఎస్ రిజరేషన్లు జగన్ నిలిపివేసి కాపులకు అన్యాయం చేశాడన్నారు. టీడీపీ హయాంలో కాపు భవనాల నిర్మాణం చేపడితే అవి పూర్తిచేయలేదని వీటికి వైసీపీ కాపు నాయకులు సమాధానం చెప్పాలన్నారు. కాపులతో పాటు బీసీ, ఎస్సీ, ఎస్టీలకు జగన్ అన్యాయం చేశాడన్నారు. జేఏసీ నాయకులు ఆరేటి ప్రకాష్, సలాది రామకృష్ణ మాట్లాడుతూ ముద్రగడ పద్మనాభం వైసీపీకి ఎందుకు మద్దతిచ్చారో కాపు జాతికి చెప్పాలన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత వాయిదా

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 14: పెదతాడేపల్లి సబ్ స్టేషన్ మరమ్మతు పనులు వాయిదా వేయడంతో సోమ, మంగళవారాలు విద్యుత్తు సరఫరా యథావిధిగా ఉంటుందని తాడేపల్లిగూడెం ఈఈ ఎస్. వెంకటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తాడేపల్లిగూడెం పట్టణం, మండలం, పెంటపాడు మండలాల్లో విద్యుత్తు సరఫరాలో ఎలాంటి ఇబ్బంది ఉండదని స్పష్టం చేశారు.

తెన్నేటి మాస్టారుకి జ్ఞాన బుద్ధ సాహితీ పురస్కారం

పాలకోడేరు, ఏప్రిల్ 14 : తెలుగు వెలుగు ఉగాది జ్ఞాన బుద్ధ సాహితీ పురస్కారాన్ని పాలకోడేరు జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల తెలుగు మాస్టారు, కవి, రచయిత, అక్షర కిరిటీ తెన్నేటి మాస్టారు అందుకున్నారు. శ్రీక్రోధి నామ సంవత్సర ఉపాధిని పురస్కరించుకుని హైద్రాబాద్ శ్రీత్యాగరాయ గానసభ, కళా వెంకట దీక్షితులు కళావేదికలో నిర్వహించిన తెలుగు వెలుగు ఉగాది సాహితీ సాంస్కృతిక ఉత్సవాలలో తెన్నేటి మాస్టారు ఈ అవార్డును అందుకున్నారు.

'మేనిఫెస్టోలతో ప్రజలకు ఉపయోగం లేదు'

పెనుగొండ, ఏప్రిల్ 14: ఎన్ని రాజకీయ పార్టీలు మేనిఫెస్టోలుపెట్టినా తమ సొంత లాభాలకే తప్ప ప్రజలకు ఉపయోగపడేవిధంగా ఏ పార్టీ అమలు చేయలేదని జైభీమ్ రావ్ భారత పార్టీ నరసాపురం ఎంపీ అభ్యర్థి ఓలేటి నాగేంద్ర కృష్ణ, ఆచంట ఎమ్మెల్యే అభ్యర్థి కాకి శ్యామ్ కుమార్, తణుకు ఎమ్మెల్యే అభ్యర్థి శాఖ సురేశ్ అన్నారు. ఆదివారం పెనుగొండలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే తరానికి ఒక నూతన సృష్టిగా తయారు చేస్తామన్నారు.

పాఠశాలకు యూబీఐ ఇన్వర్టర్ వితరణ



సమావేశంలో మాట్లాడుతున్న యూబీఐ రీజనల్ హెడ్ వెంకన్నబాబు

తణుకు, ఏప్రిల్ 14: అంబేడ్కర్ మార్గం ఆదర్శమని యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా రీజనల్ హెడ్ ఎం.వెంకన్నబాబు అన్నారు. ఆదివారం యూబీఐ ఆధ్వర్యంలో పెనుగొండలోని ఏపీఎస్‌డబ్ల్యుఆర్ స్కూలుకు ఇన్వర్టర్, బ్యాటరీలు బహూకరించారు. లీడ్ బ్యాంకు మేనేజర్ ఏ.నాగేంద్ర ప్రసాద్, రీజనల్ హెడ్ సంగీత కుమారితో పాటు సిబ్బంది, వివిధ బ్రాంచిల హెడ్స్ పాల్గొన్నారు.

వృద్ధులకు ఉచిత వైద్య సేవలు

తణుకు, ఏప్రిల్ 14: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్తంగా ఆదివారం ప్రముఖ నేత్ర వైద్యుడు డా. హుస్సేన్ అహ్మద్ తణుకు, పైడిపర్రు, ప్రాంతాల్లో పర్యటించి 9 మందికి వైద్య సేవలందించారు. వేల్పూరుకు చెందిన సత్యనారాయణమూర్తి ఆర్థిక సాయంతో ఉచితంగా మందులు అందజేశారు. సంఘ అధ్యక్షుడు అల్లూరి కరుణాకర్ చౌదరి, కోశాధికారి అర్జి భాస్కరరావు, గిరజాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

జిల్లా బాస్కెట్ బాల్ అధ్యక్షునిగా మద్దాల వాసు



పాలకొల్లు, ఏప్రిల్ 14 : జిల్లా బాస్కెట్ బాల్ అధ్యక్షునిగా ఉల్లంపర్రు మాంటిస్సోరీ స్కూల్ అడ్మినిస్ట్రేటర్, డైరెక్టర్ మద్దాల శ్రీనివాస్ (వాసు) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బాస్కెట్ బాల్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నిక ఉల్లంపర్రు మాంటిస్సోరీ స్కూల్లో జరిగింది. జిల్లా కార్యదర్శిగా కర్రి కృష్ణారెడ్డి, కోశాధికారిగా వి సత్తిరెడ్డి, ఉపాధ్యక్షులుగా కెవిఎస్ఎన్ ప్రసాద్, సంయుక్త కార్యదర్శులుగా రేలంగి రామకృష్ణ, బి.ఉమామహేశ్వరి ఎన్నికయ్యారు.

స్నేహితుడికి ఆర్థిక సాయం



మొగల్తూరు, ఏప్రిల్ 14: శేరేపాలెం గ్రామానికి చెందిన మామిడిశెట్టి ఏడుకొండలు హోమ్‌గార్డుగా విధులు నిర్వహించేవాడు. ఆయనకు చక్కెర వ్యాధి రావడంతో అది గ్యాంగ్రిన్‌గా మారడంతో కాలు తీయాల్సి వచ్చింది. భార్య, ఇద్దరు ఆడబిడ్డలతో వైద్యం చేయించుకునేందుకు ఇబ్బందులు పడుతున్నాడు. ఈవిషయాన్ని గమనించిన ఆయన 10వ తరగతి విద్యార్థుల మిత్రబృందం మొగల్తూరు ఉన్నత పాఠశాలలో సమావేశమై రూ.50వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని బాధితుడుకు ఆదివారం అందించారు. ఈ కార్యక్రమంలో 1987-88 విద్యార్థుల బృందం పాల్గొన్నది.

కూటమితోనే అన్ని వర్గాలకు న్యాయం: ఆరిమిల్లి



తణుకు, ఏప్రిల్ 14: రాష్ట్రంలో అన్ని వర్గాలకు న్యాయం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వంతో నే సాధ్యమని తణుకు నియోజకవర్గ కూటమి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఆదివారం పట్టణంలోని 9వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్ళి కరపత్రాలు పంపిణీ చేసి కూటమి ప్రభుత్వం ద్వారా వచ్చే లబ్ధిని వివరించారు. టీడీపీ, జన సేన, బీజేపీ నాయకులు డాక్టర్ దొమ్మేటి వెంకట సుధాకర్, కలగర వెంకట కృష్ణ, ఒమ్మి రాంబాబు, సానబోయిన రామకృష్ణ, సానబోయిన జనార్దన్ పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలకు స్పందన



24వ వార్డులో కృష్ణ తులసి ప్రచారం

తణుకు, ఏప్రిల్ 14: చంద్రబాబు ప్రతిపాది ంచిన సూపర్ సిక్స్ పథకాలకు మహిళల నుంచి విశేష స్పందన లభిస్తోందని తణుకు నియోజక వర్గ టీడీపీ కూటమి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ సతీమణి కృష్ణ తులసి అన్నారు. ఆదివారం పట్టణంలోని 24వ వార్డులో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చంద్రబాబు నాయక త్వం రాష్ట్రానికి చారిత్రక అవసరం అన్నారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచుతూ సైకిల్, కమలం గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు.

మరో ఎన్నికల స్టంట్‌కు తెరతీసిన జగన్... పితాని

ఆచంట, ఏప్రిల్ 14: ఎన్నికలు వస్తున్నాయంటే ఒక్కొక్క ఎన్నికల్లో ఒక్కొక్క డ్రామా ఆడటం సీఎం జగన్‌కు వెన్నతో పెట్టిన విద్య అని ఆచంట టీడీపీ కూటమి అభ్యర్థి పితాని సత్యనారాయణ ఎద్దేవా చేశారు. వల్లూరులో ఆదివారం జరిగిన జయహో బీసీ సభలో పాల్గొన్న పితాని జగన్‌పై పలు విమర్శలు చేశారు. కోడికత్తి డ్రామా, బాబాయి హత్య కేసు, ఇప్పుడు గులకరాయి డ్రామాతో మరొకసారి ఎన్నికల స్టంట్‌కు జగన్ డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. ఒకే రాయి ఒకే సారి జగన్‌తోపాటు వెల్లంపల్లి శ్రీనివాస్‌కు కూడా తగిలిందంటే ఇది ఎటువంటి డ్రామానో అని పితాని విమర్శించారు. అమరావతి రాజధానిని రావణకాష్టంగా మార్చిన జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజా వేదిక కూల్చిన దుర్మార్గుడు జగన్ అన్నారు. ఇసుక, మద్యం, భూదందాలతో రాష్ట్రంలో దోచుకున్నడబ్బును తాడేపల్లి ప్యాలెస్‌కు తరలిపోయాయని మండిపడ్డారు.

బడుగుల అభ్యున్నతి కోసమే వచ్చా

ఆచంట, ఏప్రిల్ 14: బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసమే తాను రాజకీయాల్లోకి వచ్చానని ఈ ఎన్నికల్లో అరాచక పాలనకు చరమగీతం పాడాలని ఆచంట టీడీపీ కూటమి అభ్యర్థి పితాని సత్యనారాయణ అన్నారు. ఆదివారం వల్లూరులో జరిగిన జయహో బీసీ సభ నియోజకవర్గ బీసీ సంఘం అధ్యక్షుడు తాళం శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సభకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న పితాని మాట్లాడుతూ పితాని ఇంటింటికి వెళ్ళి ఓటు అడుక్కుటున్నాడని ఎమ్మెల్యే రంగనాథరాజు వ్యాఖ్యానించడంపై పితాని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేకు ఇంటింటికి వెళ్ళి ఓటు అడిగి దమ్ము, ధైర్యం లేకపోవడం వల్లే తనపై విమర్శలు చేస్తున్నాడన్నారు.

టీడీపీలో చేరిక

పెనుమంట్ర, ఏప్రిల్ 14 : పొలమూరు గ్రామానికి చెందిన రజకులు 11మంది టీడీపీ కూటమి అభ్యర్థి పితాని సత్యనారాయణ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఐదేళ్ల పాలనలో బీసీ కులాలకు లబ్ధి జరగలేదని అన్నారు. ఎస్సీలలో రజకులను చేరుస్తానని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన జగన్మోహన్ రెడ్డి హామీని విస్మరించారని అన్నారు. పార్టీలో చేరిన రజకులకు టీడీపీ కండువాలు కప్పారు.

పెనుగొండ: పెనుగొండ మండలం సోమరాజుచెరువు కు చెందిన వైసీపీ సర్పంచ్ దంపనబోయిన రూపావతి హరిబాబు వైసీపీకి గుడ్‌బై చెప్పి మాజీ మంత్రి పితాని సత్యనారాయణ సమక్షంలో టీడీపీలో చేరారు.వారితోపాటు గ్రామ వైసీపీ ఉపాధ్యక్షుడు దంపనబోయిన గణపతిరావు,వైసీపీ సీనియర్ నాయకులు శీలబోయిన పెద్దిరాజు,తో పాటు 220 మంది టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. అలాగే మునమర్రు వైసీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు తోట శివాజీతోపాటు 10 మంది టీ డీపీ తీర్థం తీసుకున్నారు.

ఓటమి భయంతో జగన్ డ్రామాలు: తోట

భీమవరం అర్బన్, ఏప్రిల్ 14: ముఖ్యమంత్రి జగన్ బస్సు యాత్ర సభలకు ప్రజలు రాకపోవడంతో ఓటమి భయంతో మరో కోడి కత్తి డ్రామాలాగా రాయి దాడితో ప్రజల సానుభూతి పొందాలనుకోవడం సిగ్గుచేటని టీడీపీ జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి అన్నారు. జగన్ పర్యటనలో కరెంటు ఎందుకు నిలిపివేశారని ప్రశ్నించారు. దాడి జరిగిన కొన్ని నిమిషాల్లోనే సోషల్ మీడియాలో ఇది టీడీపీ పనేనని విస్తృత ప్రచారం చేసి ఎన్నికలో లబ్ధిపొందాలనుకోవడం పిరికి పంద చర్య అన్నారు.

జగన్ సానుభూతి డ్రామా: ఆరిమిల్లి

తణుకు, ఏప్రిల్ 14: ఎన్నికల్లో సానుభూతి కోసం జగన్‌పై దాడి జరిగిందంటూ వైసీపీ డ్రామా నడిపిస్తోందని మాజీ ఎమ్మెల్యే, ఉమ్మడి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఆదివారం ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో కోడికత్తి డ్రామాతో సానుభూతి ఓట్లు వేయించుకున్న జగన్ ఇపుడు మరో డ్రామాకు తెర తీశారని వివరించారు. సీఎం పర్యటనలో విద్యుత్ నిలిచిపోవడం కుట్రేనని, చాలా సేపటి తర్వాత ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్ళి డ్రామాను మరింత రక్తి కట్టించారని తెలిపారు.

ఇరగవరం: కావలిపురం గ్రామానికి చెందిన పలువురు ఆదివారం తణుకు కూటమి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి ఆరిమిల్లి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించి కూటమి విజయానికి కృషి చేయాలని కోరారు. రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి దొమ్మేటి సుధాకర్, కావలిపురం సర్పంచ్ వనచర్ల అప్పన్నస్వామి పాల్గొన్నారు.

కూటమినే నమ్మండి.. భవిష్యత్‌కు గ్యారెంటీ

భీమవరం రూరల్, ఏప్రిల్ 14 : కూటమితోనే అభివృద్ధి సాధ్యమవుతుందని, కూటమిని నమ్మితే భవిష్యత్ గ్యారెంటీ అని భీమవరం జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం మండలం పెదగరువు గ్రామం సర్పంచ్ రావూరి లాజర్, శ్రీనివాస్‌రాజు ఆధ్వర్యంలో 50 మంది వైసీపీ శ్రేణులు జనసేన జిల్లా అధ్యక్షుడు కోటికలపూడి గోవిందరావు, మాజీ ఎమ్మెల్యే అంజిబాబు సమక్షంలో జనసేన పార్టీలోకి చేరారు. మాజీ ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ మోసపూరిత జగన్ పాలనకు స్వస్తి చెబుదామని, అభివృద్ధి, సంక్షేమం చూపే కూటమిని ఎన్నుకుందామని అన్నారు.

కూటమితోనే రాష్ట్ర అభివృద్ధి



పార్టీలో చేరిన వారికి కండువా కప్పుతున్న బొలిశెట్టి శ్రీనివాస్

తాడేపల్లిగూడెం అర్బన్, ఏప్రిల్ 14: రాష్ట్రం అప్పుల ఊబి నుంచి బయటపడి అభివృద్ధి చెందాలంటే కూటమి అధికారంలోకి రావాలని తాడేపల్లిగూడెం కూటమి అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం పట్టణంలోని 15వ వార్డు నుంచి బొలిశెట్టి శ్రీనివాస్, తోట గోపి సమక్షంలో పత్యాల వెంకటేశ్వరరావు సోదరులు, దూద్ బాషా, పజ్జూరి శ్రీనివాస్ తదితరులు జనసేనలో చేరారు. కండువా కప్పి బొలిశెట్టి వారిని పార్టీ లోకి ఆహ్వానించారు.

జగన్‌పై దాడిలో అనుమానాలెన్నో: వలవల

తాడేపల్లిగూడెం అర్బన్, ఏప్రిల్ 14: సీఎం జగన్మోహన్‌రెడ్డిపై జరిగిన దాడి ఘటనలో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ సీఎం పర్యటిస్తుండగా విద్యుత్ తీసేయడం అనుమానాలకు దారి తీస్తుందన్నారు. దీనిపై కట్టుదిట్టమైన దర్యాప్తు జరగాలన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబుపై ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ విచక్షణ లేకుండా మాట్లాడుతున్నారంటూ విరుచుకుపడ్డారు. దళిత మహిళకు ఉద్యోగం ఇస్తానని చెప్పి రూ 4.30 లక్షలు కాజేశారని, దళితులంతా ఈ మంత్రికి బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

కూటమితో అన్ని వర్గాలకు మేలు: సూర్యకుమారి



పోడూరు, ఏప్రిల్ 14: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం రాగానే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు సతీమణి నిమ్మల సూర్యకుమారి అన్నారు. పోడూరు మండలం జిన్నూరు గ్రామంలో ఆదివారం ఆమె ఇంటింటి పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ దేవళ్ల ప్రసాదు, మండల టీడీపీ అధ్యక్షుడు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, ఎంపీటీసీ భూపతిరాజు సరస్వతీ సత్యనారాయణరాజు, రాష్ట్ర టీడీపీ సీనియర్ నాయకులు దాసరి రత్నరాజు పాల్గొన్నారు.